
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
3
మంగళవారం 31 డిసెంబరు 2024




6 ఐదేళ్ల నిరాశ.. సీఎం మీదే ఆశ
పల్నాడు అభివృద్ధిపై ప్రజల ఎదురు చూపులు
జిల్లాపై సీఎం చంద్రబాబు వరాలు కురిపించేనా



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా విడుదల
- 3 లక్షల 46 వేల 529 మందికి ఓటుహక్కు
- అత్యధికంగా గుంటూరులో... అత్యల్పంగా ఏలూరులో ఓటర్లు
4



- యలమందలలో పింఛన్ల పంపిణీ
- గ్రామస్థులతో ముఖాముఖి
- కోటప్పకొండలో పూజలు



నేడు పల్నాడులో.. సీఎం పర్యటన

నరసరావుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా పల్నాడు జిల్లా పర్యటనకు వస్తున్నారు. నరసరావుపేట నియోజకవర్గం, యలమందల గ్రామంలో నేడు జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఆయన పర్యటనకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. గ్రామంలో బీసీ వర్గానికి చెందిన ఉల్లంగుల ఏడుకొండలు, ఎస్సీ కాలనీకి చెందిన తలారి శారమ్మకు, సీఎం వారి ఇళ్లకు వెళ్లి పింఛన్‌లు పంపిణీ చేస్తారు. ఆయా కుటుంబాల యోగక్షేమాలను ఆయన తెలుసుకుంటారు. వారి ఇళ్లలో తేనీటి విందు చంద్రబాబు స్వీకరించనున్నారు. ఆయా ప్రాంతాల్లో రహదారులకు అధికారులు మరమ్మతులు నిర్వహించారు. పింఛన్‌ల పంపిణీ అనంతరం గ్రామంలోని రామాలయాన్ని సందర్శించి పూజలు చేస్తారు. ఆలయం ఎదుట గ్రామస్థులతో ముచ్చటిస్తారు. ఇందు కోసం వేదిక ఏర్పాటు చేశారు. ఇక్కడికి 1200 నుంచి 1500 మందిని మాత్రమే అనుమతిస్తున్నారు. వేదికపై కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీని మాత్రమే అనుమతించనున్నారు. భారీ బహిరంగ సభలు.. జనసమీకరణలు లేవు. ఆర్భాటాలు లేకుండా వేదిక నిర్వహిస్తున్నారు. ప్రజలతో ముచ్చటించిన అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడతారు. జిల్లా అభివృద్ధిపై దిశా నిర్దేశం చేస్తారు. ఈ కార్యక్రమం అనంతరం రోడ్డు మార్గాన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధికి చేరుకుంటారు. శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అనంతరం కోటప్పకొండ నుంచి రోడ్డు మార్గాన యలమందల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకొని ఉండవల్లిలోని నివాసానికి చంద్రబాబు చేరుకుంటారు.


బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు

భారీ బందోబస్తు

చంద్రబాబు పర్యటనకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తు ఏర్పాట్లపై ఐజీ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాస రావు పోలీసు అధికారులతో సమీక్షించారు. సీఎం భద్రత కోసం రూపొందించిన బందోబస్తు ప్రణాళికను సిబ్బందికి తెలియజేశారు. సెక్టార్ల వారీగా బాధ్యతలను అధికారులు, సిబ్బందికి అప్పగించారు. హెలిప్యాడ్, పింఛన్ దారుల నివాసాలు, కోదండరామ స్వామి దేవాలయం, సభాస్థలి, కోటప్పకొండలో అన్ని చోట్ల విధులకు సిబ్బందిని కేటాయించారు. రోప్ పార్టీలు, రూట్ బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పార్కింగ్ సెక్టార్లలో పర్యవేక్షణకు అధికారులను నియమించారు. సీఎం పర్యటించే ప్రాంతాలలో డ్రోన్‌తో నిఘా ఉంచారు. సీఎం కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు. డ్రోన్‌ల ద్వారా ఏర్పాట్లను ఎస్పీ శ్రీనివాస రావు పరిశీలించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జేసీ సూరజ్ ఏర్పాట్లను పరిశీలించారు.

ఆనందంగా ఉంది


ఏడుకొండలు

తమ ఇంటికి చంద్రబాబు వచ్చి పింఛన్ ఇస్తున్నారనే సమాచారం తెలుసుకున్న శారమ్మ, ఏడుకొండలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఉల్లంగుల ఏడుకొండలు. ఇతనికి 68 ఏళ్లు. బీసీ వర్గానికి చెందిన వ్యక్తి. ఆయనకు కుమారుడు, కోడలు.. ఇరువురు కవలలైన మనుమలు ఉన్నారు. ఏడు కొండలు ఇంటికి చంద్రబాబు వెళ్లి రూ.4 వేలు వృద్ధాప్య పింఛన్ అందించనున్నారు. నా ఇంటికి చంద్రబాబు వస్తుండటం పట్టలేనంత సంతోషంగా ఉందని ఏడుకొండలు అన్నారు.

లారీ డ్రైవర్‌గా పనిచేసే శారమ్మ భర్త, 2021లో కరోనా రెండో విడతలో మృతి చెందాడు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2023లో ఆమెకు వితంతు పింఛన్ మంజూరైంది. చంద్రబాబు తన ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తారని అధికారులు వచ్చి చెబితే నమ్మలేకపోయాను. విలేకరులు వచ్చి వివ రాలు అడుగుతుంటే ఇప్పుడు నమ్ముతున్నాను. నిజంగానే చంద్రబాబు నా ఇంటికి వస్తున్నారు. చెప్పలేనంత ఆనందంగా ఉంది. ఆయన మా ఇంటికి రావడం మా అదృష్టమని శారమ్మ సంతోషాన్ని వ్యక్తం చేసింది.


తలారి శారమ్మ

ఎస్సీల స్థితిగతులపై అధ్యయనం

- ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా
- గుంటూరులో వినతుల స్వీకరణ

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా షెడ్యూల్ కులాలకు చెందిన ప్రజల జీవన స్థితిగతులపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. జిల్లాల పర్యటనలో భాగంగా ఆయన సోమవారం గుంటూరు జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండి అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అలానే వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఎస్సీలలోని ఉపకులాల వారీగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా స్థితిగతులపై ప్రభుత్వ శాఖల వారీగా సమగ్ర వివరాలతో కచ్చితమైన గణంకాలను సేకరిస్తున్నామని చైర్మన్ మిశ్రా తెలిపారు. అలానే ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని పరిశ్రమలు ఏర్పాటు చేసి లబ్ధి పొందిన వారి వివరాలు కూడా సమగ్రంగా సేకరిస్తున్నామని చెప్పారు. అధికారులు అందించే వివరాలను పూర్తిగా అధ్యయనం చేసి రిమార్కులతో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు.



ఎస్సీ కులాల వర్గీకరణకు ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా నిర్వహించిన సమావేశానికి హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ ఇతర అధికారులు

జిల్లాలో ఎస్సీల్లోని ఉప కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా స్థితిగతులపై శాఖల వారీగా అధికారులు సమగ్ర వివరాలను కచ్చితమైన అంకెలతో అందించాలని రంజన్ మిశ్రా అధికారులను ఆదేశించారు. తొలుత కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, జీయంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హాతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్సీల్లోని ఉపకులాల వారీగా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలోని ఉద్యోగులు, పాఠశాల, కళాశాల, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారు, వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాల్లో, ప్రభుత్వ పథకాల ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసిన వారు, వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన వారి వివరాలు సమగ్రంగా అందించాలన్నారు. అధికారులు అందించిన వివరాల ప్రకారం పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించడం జరుగుతుందన్నారు. షెడ్యూల్ కులాలలో అతి తక్కువ శాతం ఉన్న ఇతర ఉప కులాల వారికి షెడ్యూల్ కుల ధ్రువీకరణ పత్రాల జారీకి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా పరిషత్ సిఈఓ జ్యోతిబసు, డీపీఓ సాయికుమార్,డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి డీఈఓ రేణుక, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ జయలక్ష్మి, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి తదితరులు వారి శాఖల వివరాలను మిశ్రాకు వివరించారు. సమావేశం అనంతరం ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణపై ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలు, కుల సంఘాల నాయకుల నుండి అభిప్రాయాలు, వినతులు స్వీకరించారు. తాడికొండ శాసన సభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ, జాతీయ, రాష్ట్ర స్థాయి, ఉమ్మడి గుంటూరు జిల్లాల షెడ్యూల్ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశంపై ఏక సభ్య కమిషన్ చైర్మన్‌కు అర్జీలు అందించి, అభిప్రాయాలను తెలిపారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశంపై అర్జీ అందించటానికి వచ్చిన విభిన్న ప్రతిభావంతుల వద్దకే ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా వెళ్లి అర్జీలు స్వీకరించారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ అంశానికి సంబంధించి మొత్తం 124 అర్జీలను అందించారు. ఈ సమావేశంలో గుంటూరు, బాపట్ల జిల్లాల రెవెన్యూ అధికారులు ఎస్ షేక్ ఖాజావలి, గంగాధరగౌడ్, ఆర్‌డీవో కే శ్రీనివాస రావు, డీడీ సోషల్ వెల్ఫేర్ మధు సూదన రావు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి ప్రేమ కుమారి, ప్రజలు, కుల సంఘాల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



- బహిరంగ మద్యపానం ఉపేక్షించం
- ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదు
- ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల ,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణలో జరుపుకోవాలని ఎస్పీ తుషార్ డూడి ఆకాంక్షించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపిన, బహిరంగప్రదేశాలలో మద్యం సేవించిన ఉపేక్షించబోమన్నారు. అల్లర్లు సృష్టించిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైలెన్సర్‌లు లేకుండా తీవ్రమైన ధ్వనులు సృష్టిస్తూ ద్విచక్రవాహనాలు నడిపితే వాహనం సీజ్ చేస్తామన్నారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేయవద్దు అని యువతకు సూచించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించరాదన్నారు. గుంపులు,గుంపులుగా తిరుగుతూ ఇతరులకు ఇబ్బంది కలిగించరాదన్నారు. ఈవ్‌టీజింగ్ చేస్తే చర్యలు తప్పవన్నారు. బహిరంగపార్టీలు నిర్వహించటం, నృత్యాలు చేయటం, బాణా సంచా కాలుస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమయానికి మించి మద్యం విక్రయిస్తే దుకాణాలు, బార్లపై చర్యలు తీసుకుంటానన్నారు. పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తానన్నారు. ముఖ్యమైన కూడలిలలో పికెట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసు ఆదేశాలను పెడచెవిన పెడితే ఉపేక్షించేదిలేదన్నారు. యువతపై కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలలో చేరాలంటే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. కావున ప్రజలంతా పోలీసులకు సహకరించి ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలని ఎస్పీ కోరారు.

మద్యం.. విడి విక్రయాల జోరు

- బెల్ట్ షాపుల నిర్వహణకు వేలం
- సీసాకు రూ.30 అదనపు వసూళ్లు
- సమయపాలన పాటించని వైన్ షాపులు, బార్లు
- ఆధిపత్యం కోసం సిండికేట్ల మధ్య పోరు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

చీరాల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులు పెట్టకూడదు. అధిక ధరలకు మద్యం విక్రయాలు జరపకూడదని సాక్షాత్తూ సీఎం చంద్రబాబు చెబుతున్నా, ఆ మాటలు చీరాల, పర్చూరు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలోని లైసెన్సీలు తమకు వర్తించదన్నట్లు వ్యవహరిస్తున్నారు. విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తూ మద్య రేట్లు పెంచి అమ్ముతున్నారు. అంతే కాకుండా ఈ బెల్టు వ్యవహారంలో తమ మాటే చెల్లాలంటూ ఆధిపత్య పోరుకు తెగబడుతున్నారు. ఈ వ్యవహారంలో చీరాల నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా మద్యం వ్యాపారంలో ఉన్న ఇద్దరు అన్నదమ్ముల మధ్య ప్రత్యక్షంగా పోరుకు తెరలేచినట్లు తెలుస్తోంది. ఇద్దరు అన్నదమ్ములు సుదీర్ఘకాలంగా మద్యం వ్యాపారంలో చక్రం తిప్పుతున్నారు. ఈ నేపథ్యంలో వారిని లిక్కర్ వ్యాపారంలో టక్కరోళ్లు అంటూ ముద్దుగా సంబోధిస్తుంటారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇందులో చేరిన ఒక సోదరుడు, తన మాట వింటేనే వ్యాపారం సజావుగా సాగుతుందంటూ, పట్టు కోసం పాకులాడుతున్నాడు. అయితే ఈ వ్యాపారుల్లో మూడు పార్టీలకు చెందిన వారు ఉండడంతో, ఒకరిపై ఒకరు ఆధిపత్య పోరుకు సిద్ధమవుతున్నారు.

బెల్ట్ షాపుల నిర్వహణకు వేలం పాటలు

తీరప్రాంతం, మైదాన ప్రాంతం అనే తేడాలేకుండా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఇక తీరప్రాంతంలో అయితే ఏకంగా బెల్ట్ షాపుల నిర్వహణకు వేలం పాటలు నిర్వహించి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందులో చీరాల మండలం విజయలక్ష్మీపురంలో రూ.3 లక్షలకు, వేటపాలెం మండలం కఠారివారిపాలెంలో రూ.5 లక్షలకు బెల్ట్ షాపుల నిర్వహణకు పాటలు ద్వారా కేటాయించినట్లు విశ్వసనీయ సమాచారం. డిపాజిట్ లేకుండా పట్టణ, రూరల్ అని భేదం లేకుండా బెల్ట్ షాపుల నిర్వహణ జరుగుతోంది.

అదనపు వసూళ్లు

పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఎక్కడెక్కడయితే బెల్ట్ షాపులు ఉన్నాయో అక్కడ బాటిల్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రధానంగా తీరప్రాంతంలో, పట్టణాల్లో కూడా దొరకని క్లాస్ బ్రాండ్‌ల మద్యం తీర ప్రాంతంలోని బెల్ట్ దుకాణాల్లో దొరుకుతోంది. రిసార్టులకు వచ్చేవారు అక్కడ కొనుగోలు చేస్తుండటంతో విక్రయదారులు అందుకు అనుగుణంగా పెద్ద పెద్ద బ్రాండ్లను అందుబాటులో ఉంచుతున్నారు. కొన్ని సందర్భాల్లో విక్రయదారులు, కొనుగోలుదారుల మధ్య ధరల విషయంలో గొడవలు జరిగిన సందర్భాలు ఉన్నాయి.

ఎవరినీ ఉపేక్షించం : నాగేశ్వరరావు, సీఐ, చీరాల ఎక్సైజ్ సర్కిల్

బెల్ట్ షాపులు అనేవాటికి ఎలాంటి అనుమతులు ఉండవు. అనధికారికంగా మద్యం విక్రయించే వారిని ఎవరినైనా ఉపేక్షించం. తీరప్రాంతమైనా, మైదాన ప్రాంతమైనా ఒక్కటే. ఇప్పటికే పలు సందర్భాల్లో కేసులు నమోదు చేశాం. మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌ల నిర్వాహకులు కచ్చితంగా సమయపాలన పాటించాలి. లేదంటే తగిన చర్యలు చేపడతాం.



పీఎం కిసాన్‌లో... 33,889 మంది అనర్హులు

- లెక్కతేల్చిన వ్యవసాయ శాఖ
- ఐదేళ్లలో రూ.100 కోట్లు వారి ఖాతాల్లో జమ
- యాజమాన్య హక్కులు లేకున్నా లబ్ధిపొందిన వారు కోకొల్లలు
- ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వారూ లబ్ధిదారులే

గుంటూరు సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా పీఎం కిసాన్ పథకం కింద లబ్ధి పొందుతున్న అనర్హుల లెక్క తేలిపోయింది. గుంటూరు జిల్లాలో 33889 మంది అనర్హులు ఉన్నట్లు వ్యవసాయ శాఖ లెక్క తేల్చింది. దాంతో 2019 నుంచి మొత్తం 1,21,898 మంది పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందుతుండగా, తాజా సర్వేతో అర్హులైన లబ్ధిదారుల సంఖ్య 85,460 కి పరిమితం అయ్యింది. రైతులకు పెట్టుబడి సాయం కింద ఆర్థికంగా చేయూత నిచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి లో పీఎం కిసాన్ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ పథకంలో ఒక్కో రైతుకు రూ.6 వేల వరకు కేంద్రం చెల్లిస్తుంది. ఏడాదిలో మూడు విడతలుగా నేరుగా రైతు ఖాతాలోనే పీఎం కిసాన్ సొమ్మును జమ చేస్తున్నారు. అయితే అప్పట్లో రెవెన్యూ కార్యాలయంలో ఉన్న సమాచారం ఆధారంగా ఈ నగదు బదిలీ జరుగుతూ వచ్చింది. ఫలితంగా కొందరు అనర్హులు పీఎం కిసాన్ లబ్ధి పొందుతుండగా, చాలా మంది అనర్హులు ఈ పథకానికి దూరంగా ఉన్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో అనర్హులైన వారు పీఎం కిసాన్ పథకం తమకు రావటం లేదని ప్రభుత్వానికి వేల కొద్దీ అర్జీలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం సర్వే కూడా ససేమిరా అంటూ వచ్చింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ పీఎం కిసాన్ లోని అనర్హుల లెక్క తేల్చింది.



ఎన్నారైలూ లబ్ధిదారులే...

గత ఐదేళ్ల కాలంలో విదేశాల్లో నివసిస్తున్న (ఎన్నారై)లు కూడా పీఎం కిసాన్ కింద లబ్ధి పొందినట్లు వ్యవసాయ శాఖ సర్వే లో తేలింది. జిల్లాలో 465 మంది ఎన్నారైలకు ఈ పథకం కింద నగదు జమ అయ్యింది. ఒకే ఇంటి లో ఒకరికి మాత్రమే పథకం వర్తింప చేయాలని నిబంధన ఉండగా, 3799 మంది ఒకరికంటే ఎక్కువ మంది లబ్ధి పొందారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన 477 మంది ఇప్పటివరకు పథకాన్ని వినియోగించుకున్నారు. 2019 నాటికే పొలం అమ్ముకొని కూడా ఇప్పటివరకు 5866 మంది పీఎం కిసాన్ పథకం నగదును పొందుతూ వచ్చారు. స్థిరమైన భూ యాజమాన్య హక్కులు లేకుండా ఇప్పటివరకు 12747 మంది పథకాన్ని వాడుకు న్నారు. 7247 మంది గుర్తు తెలియని, అడ్రెస్ లేని వ్యక్తులు కూడా ఇప్పటివరకు పీఎం కిసాన్ నగదును పొందారు. వీరు కాక ఆదాయపు పన్ను చెల్లిస్తూ ఈ పథకం కింద లబ్ధి పొందిన వారు 2325 మంది ఉన్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. అనర్హులను ఈ ఏడాది పీఎం కిసాన్ జాబితా నుండి తొలగించారు.

ఐదేళ్లలో....

గడచిన ఐదేళ్ల కాలంలో అనర్హులైన వారి ఖాతాలో రూ. 100 కోట్ల వరకు జమ అయ్యినట్లు తెలుతోంది. ప్రభుత్వ రికార్డులు సరిగా లేకపోవడంతో ఇంత సొమ్ము అనర్హులు అందినట్లు స్పష్టం అవుతోంది. ఇప్పటివరకు అనర్హుల ఖాతాలో జమ అయిన సొమ్మును వెనక్కి తెచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏమి చేస్తుందో వేచి చూడాల్సిందే.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 571.40 అడుగులు ఉంది. ఇది 260.08 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8108, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 21168, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 40,120 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా విడుదల

- 3 లక్షల 46 వేల 529 మందికి ఓటుహక్కు
- అత్యధికంగా గుంటూరులో... అత్యల్పంగా ఏలూరులో ఓటర్లు
- మహిళల కంటే పురుషులే అధికం

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి విడుదల చేశారు. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఫైనల్ లిస్టుని పబ్లిష్ చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆ జాబితాను అందజేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, ఎన్‌టీఆర్, ఏలూరు జిల్లాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ ఓటర్ల లిస్టులను ప్రచురించారు. ఈసీ నిబంధనల మేరకు ఈ నెల 9వ తేదీ వరకు వచ్చిన క్లెయిమ్‌లన్నింటిని విచారించి అర్హత కలిగిన వారికి ఓటు హక్కు కల్పించారు.

నామినేషన్ల దాఖలు వరకు ఓటరు నమోదు ప్రక్రియ

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక మరో మూడు నెలల్లో జరగనున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తాజా ఓటరు నమోదు ప్రక్రియని అక్టోబరు నెలలో ప్రారంభించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ప్రతీ దరఖాస్తుని సచివాలయాల సిబ్బంది ద్వారా క్షేత్ర పరిశీలన చేయించి ఏఈఆర్‌వోల రిమార్కులతో ఈఆర్‌వోకు నివేదించారు. వాటిని ఈఆర్‌వో ఎస్.షేక్ ఖాజావలి ఆమోదించారు. తిరస్కరించిన వాటికి గల కారణాలను కూడా పరిశీలించి ఆమోదం తెలిపారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం 3 లక్షల 46 వేల 529 మందికి ఓటుహక్కు కల్పించారు. ఇందులో పురుషులు 2 లక్షల 6 వేల 176, స్త్రీలు లక్ష 40 వేల 307, ఇతరులు 46 మంది ఉన్నారు. ఇందుకోసం 416 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఓటరు నమోదు ప్రక్రియ అనేది నామినేషన్ల దాఖలు వరకు జరుగుతుందని ఈఆర్‌వో ఖాజావలి తెలిపారు. అయితే ఇప్పటి నుంచి ఓటుహక్కు కల్పించే వారి పేర్లు ఆయా పోలింగ్ బూత్‌ల ఓటరు జాబితాల్లో సప్లిమెంట్‌లుగా చేరుస్తామన్నారు.

ఓటర్ల వివరాలు ఇలా....

జిల్లా	పోలింగ్ బూత్‌లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
ఏలూరు	20	9858	6218	1	16077
కృష్ణా	76	35378	27807	5	63190
ఎన్‌టీఆర్	101	45540	32685	13	78238
గుంటూరు	118	62277	45318	18	107613
బాపట్ల	28	15292	9150	5	24447
పల్నాడు	73	37831	19129	4	56964
మొత్తం	416	206176	140307	46	346529

ఎస్సీ వర్గీకరణపై సమగ్ర నివేదిక రూపొందించాలి



రాజీవ్ రంజన్ మిశ్రాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రతి ఒక్క అంశాన్ని పరిశీలించి సమగ్ర నివేదికను రూపొందించాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశం మందిరంలో సోమవారం ఎస్సీ వర్గీకరణపై నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రాకు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏకసభ్య కమిషన్‌కు వినతులకు అనుమతి కల్పించడం సంతోషంగా ఉందన్నారు. విద్యా, ఆర్థిక, ఉద్యోగ అవకాశాలు ఏ కులానికి అధికంగా అందుతున్నాయో కమిషన్ పరిశీలించాలన్నారు. 2014-19, 2019-24లో ఆయా ప్రభుత్వాల్లో ఎంత మేర లబ్ధి పొందిన అర్హుల జాబితాను పరిశీలించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ వద్దు... ఐక్యతే ముద్దు

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వద్దు... ఐక్యతే ముద్దు... వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామంటూ రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌కు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, పలువురు నాయకులు వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో సోమవారం జరిగిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి మాలమహానాడు నాయకులు హాజరయ్యారు. మాలమహానాడు నాయకులు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వార్డు, పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో పూర్తిస్థాయి తప్పులు తడకలతో కూడిన సోషల్ ఆడిట్ ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చాలాచోట్ల హిందూమాలకు బదులు క్రిస్టియన్ మాలగా చిత్రీకరిస్తున్నారని, అనేక చోట్ల సోషల్ ఆడిట్ ప్రదర్శనే లేదని, ప్రదర్శన లేని చోట మాలలు ఉన్నప్పటికీ జనాభా లెక్కల్లోకి రారన్నారు. మాలమహానాడు రాష్ట్ర మహిళా కార్యదర్శి పిల్లి మేరీ, రాష్ట్ర కార్యదర్శి సొంగా వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు ధారా హేమా ప్రసాద్, గోదా బాల, రాయని చిన్న, వెంకటేశ్వరరావు, డీజే శ్రీను, కీర్తిపాటి వెంకటేశ్వర్లు, మాలే కిరణ్, మాతంగి సుధాకర్, బొందలపాటి నాగేశ్వరరావు తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణపై వైసీపీ ద్వంద్వ వైఖరి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై వైసీపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు విమర్శించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశం మందిరంలో సోమవారం ఎస్సీ వర్గీకరణపై నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం డొక్కా మాణిక్య వరప్రసాదు మాట్లాడుతూ వర్గీకరణకు రాష్ట్రంలోని అన్ని పార్టీలు మద్దతు పలకగా వైసీపీ దొంగ నాటకాలు ఆడుతుందని మండిపడ్డారు. ఓ వైపు మాదిగలను మరోవైపు మాలలను రెచ్చగొడుతూ క్లిష్టతరం చేస్తుందని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో మాలల కంటే మాదిగలు అధికంగా ఉన్నారనీ, కానీ రిజర్వేషన్ల ఫలాలు మాలలకే వస్తున్నాయని అన్నారు. మాలలు కూడా వర్గీకరణకు మద్దతు ఇవ్వాలని కోరారు.

జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలి

పెరిగిన ఎస్సీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతం పెంచాలని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజా సుందరంబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశం మందిరంలో సోమవారం ఎస్సీ వర్గీకరణపై నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు ఆయన వినతి పత్రం అందజేశారు.

భావన్నారాయణ స్వామికి హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు



భావన్నారాయణ స్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి దుప్పల వెంకట రమణ

పొన్నూరుటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ సాక్షి భవన్నారాయణ స్వామిని సోమవారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి దుప్పల వెంకట రమణ దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి వెంకట రమణకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చక స్వాములు సాక్షి భవన్నారాయణ స్వామి ఆలయ విశేషాలను, చరిత్రను వివరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భాగంగా దేవదాయ శాఖ అధికారులు స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మెజిస్ట్రేట్ జీ.వాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వర్సిటీ వాలీబాల్ పోటీలు



విజేతలకు కప్ అందజేస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

గుంటూరు (విద్య), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉమెన్ వాలీబాల్ టోర్నమెంట్ అంతర కళాశాలల పోటీలు సోమవారం చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (చిప్స్)ఫార్మసీ కళాశాలలో నిర్వహించారు. పోటీలకు నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని మొత్తం పది టీమ్స్ హాజరైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర్ వెల్లడించారు. రెండు రౌండ్లుగా ఈ పోటీలు జరిగాయి. మొదటి రౌండ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించారు. ఈ రౌండ్‌లో విజేతలుగా నిలిచిన వారిని రెండో రౌండ్‌కి ఎంపిక చేశారు. రెండో రౌండ్ లీగ్ పద్ధతిలో నిర్వహించగా అందులో మొదటి స్థానంలో జేఎంజే (తెనాలి), రెండో స్థానంలో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్, మూడో స్థానంలో యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల టీమ్స్ నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన వారికి కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. సెక్రటరీ సీఎన్ శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ రాయపాటి గోపాలకృష్ణ, సంయుక్త కార్యదర్శి చుక్కపల్లి రమేష్, గోపీచంద్, వి.కుప్పుస్వామి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా జాతీయ ఫ్లోర్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు



క్రీడాకారులను పరియం చేసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, చైర్మన్ నాతాని

నరసరావుపేట టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కే-రిడ్జి స్కూల్‌లో రెండు రోజుల నేషనల్ ఫ్లోర్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం ప్రారంభించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో నేషనల్ క్రీడలను నిర్వహిస్తున్న కే-రిడ్జి స్కూల్ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ప్రారంభ మ్యాచ్ అండర్-12 బాలుర విభాగంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ జట్లు మధ్య జరిగిన మ్యాచ్ డ్రా గా ముగిసింది. రెండో అండర్-12 బాలికల విభాగంలో తమిళనాడు జట్టుపై 1-0 పాయింట్స్‌తో కర్ణాటక జట్టు విజయం సాధించింది. తరువాత మ్యాచ్ తమిళనాడు జట్టుపై ఆంధ్రప్రదేశ్ 1-0 పాయింట్స్‌తో విజయం సాధించింది. అండర్-17 బాలుర విభాగంలో తెలంగాణ జట్టుపై ఆంధ్రప్రదేశ్ 1-0 పాయింట్స్‌తో విజయం సాధించింది. కార్యక్రమంలో ఇండియన్ ఫ్లోర్‌బాల్ ఫెడరేషన్ వైస్ చైర్మన్ దీపేంద్ర ఆర్య, ఫ్లోర్‌బాల్ ఇండియా అబ్జర్వర్ పంకజ్, ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ ఫ్రీజో జాన్, ఏపీ ఫ్లోర్‌బాల్ సెక్రటరీ కేజే జోసెఫ్, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

గుంటూరు(లీగల్), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పొన్నూరులో న్యాయవాదిని పోలీసులు చిత్రహింసలకు గురి చేయటాన్ని నిరసిస్తూ మంగళవారం జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు కోర్టుల్లో తమ విధులను బహిష్కరించి నిరసన తెలపాలని నిర్ణయించారు. గుంటూరు జిల్లా బార్ అసోసియేషన్ల ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి ఈ మేరకు జిల్లాలోని అన్ని బార్ అసోసియేషన్‌లకు పిలుపునిచ్చారు. క్రిస్మస్ సందర్భంగా గాయపడిన వారిని పరామర్శించేందుకు పొన్నూరుకు చెందిన దళిత న్యాయవాది బేతాళ ప్రకాశరావు నాలుగు రోజుల క్రితం ఆసుపత్రికి వెళ్లగా, అతన్ని ఆసుపత్రి నుంచి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి సీఐ రవికిరణ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజ్‌కుమార్, కానిస్టేబుల్ గోపి, మాధవ గోపి, స్టేషన్ కంప్యూటర్ ఆపరేటర్ మల్లికార్జునరావు అరికాళ్లు, చేతులపై కొట్టి చిత్ర హింసలకు గురిచేసి దూషించారని ప్రకాష్‌రావు అరచేతి ఎముక విరిగిందని న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. సంబంధిత పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత నాలుగు రోజులుగా పొన్నూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఆందోళన చేస్తున్నారు. వీరికి సంఘీభావంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు కోర్టు విధులకు గైర్హాజరు కావాలని తీర్మానించారు. గుంటూరు రేంజ్ ఐజీని కలిసి సంబంధిత పోలీసు అధికారులను విధుల నుంచి తొలగించాలని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేయాలని నిర్ణయించారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో తొలిరోజు 290 మంది అభ్యర్థులకుగానూ 166 మంది అభ్యర్థులు తదుపరి రాత పరీక్షలకు ఎంపికయ్యారు. దేహదారుఢ్య పరీక్షలకు 290 మంది హాజరుకాగా వారిలో 36 మంది సంబంధిత ధ్రువ పత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 254 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు(ఫిజికల్ మెజర్మెంట్ టెస్ట్) నిర్వహించగా వారిలో 39 మందిని ఛాతీ, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. మిగిలిన 215 మందికి 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 32 మంది అర్హత సాధించలేకపోయారు. 183 మంది తదుపరి పరీక్షల కొరకు అర్హత సాధించారు. వారిలో ఒక వ్యక్తి స్వచ్ఛందంగా వైదొలగగా మిగిలిన 182 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. వారిలో 74 మంది అర్హత సాధించారు. 182 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా వారిలో 166 మంది అర్హత సాధించారు. మొత్తం 254 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 166 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు.

జమ్ము కశ్మీర్‌పై జార్ఖండ్ ఇన్నింగ్స్ విజయం

మంగళగిరి సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో జమ్ము కశ్మీర్‌పై జార్ఖండ్ జట్టు ఘనవిజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో జమ్ము కశ్మీర్ 129 పరుగులు చేయగా, జార్ఖండ్ జట్టు 7 వికెట్ల నష్టానికి 365 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన జమ్ము కశ్మీర్ జట్టు 220 పరుగులకు ఆలౌటయింది. వకాస్ నిసార్ 108 పరుగులతో రాణించాడు. జార్ఖండ్ ఆల్‌రౌండర్ అర్జున్ ప్రియదర్శి బ్యాటింగ్‌లో 150 పరుగులు చేయడంతోపాటు బౌలింగ్‌లోనూ రాణించి 6 వికెట్లు పడగొట్టాడు. దీంతో జార్ఖండ్ ఇన్నింగ్స్ 16 పరుగులతో భారీ విజయాన్ని నమోదు చేసింది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 39.93 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

బాపట్ల ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన వర్క్‌షాపు

బాపట్లరూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపట్ల ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఈసీ విద్యార్థులకు మూడు రోజులు నుంచి నిర్వహిస్తున్న వర్క్‌షాపు సోమవారంతో ముగిసిందని కళాశాల ఈసీఈ విభాగాధిపతి బి.మహాలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈజి ఇంటర్‌ఫేస్ సొల్యూషన్స్ విజయవాడ ఆధ్వర్యంలో పీసీబీ డిజైనింగ్ అండ్ ఫ్రాబ్రికేషన్ అనే అంశం మీద విద్యార్థులకు వర్క్‌షాపులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కమలాత్మిక హోమం, లక్ష్మీపూజ

బాపట్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల చీలురోడ్డులోని శ్రీ పాండురంగాస్వామి దేవాలయంలో సోమవారం కమలాత్మిక హోమం, లక్ష్మీపూజ వైభవంగా జరిగాయి. ముందుగా మండపారాధన, గణపతిపూజ, నవగ్రహల క్ష్మీగణపతి, సుదర్శన, మృత్యుంజయ మహా యంత్రాలతో కమలాత్మిక హోమం జరిగాయి. కార్యక్రమంలో అర్చకులు నెమలికంటి హనుమంతరావు, మేడూరి వెంకటఅప్పలచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు, పి.రఘురాం, గూడూరి సాయి వెంకట్ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

రేపల్లె, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : నిజాంపట్నం మండలం కూచినపూడి పంచాయతీ జొన్నావారిపాలేనికి చెందిన నందిపాకల నిర్మల, దున్నా దీనమ్మ అనారోగ్యంతో మృతి చెందటంతో వారి కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నల్లపాటి యల్లయ్య, తులగం రవితేజ, అరజా అర్జున్ పాల్గొన్నారు.

టీఎం రావు ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టీఎం రావు ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సోమవారం రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు భట్టిప్రోలు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాఠశాల హెచ్‌ఎం రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్, కోటేశ్వరమ్మ, ఉమామహేశ్వరరావు, మురళీధరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి

బాపట్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : హిందూ దేవాలయాల రక్షణ కోసం హైందవ శంఖారావ సభ జనవరి 5వ తేదీన విజయవాడలో జరుగుతుందని, ఆ సభను విజయవంతం చేయాలని సమరసత సేవ ఫౌండేషన్ బాపట్ల సంయోజక్ శ్రీనివాసులు అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల సమావేశం బాపట్ల రామానుజకూటం హాలులో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, మోదడుగు సూరిబాబు, చిల్లా సత్యనారాయణ, ధర్మప్రచారక్‌లు జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ, అక్కల సుబ్బారెడ్డి, దండుప్రోలు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి ఆక్రమించారని ఫిర్యాదు

బాపట్లరూరల్,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నాకు తల్లిదండ్రులు లేరు.. నాకు అండగా ఉన్న ఆస్తిని ఆక్రమించారంటూ సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో చుండూరు మండలం దుండిపాలేనికి చెందిన కె.పవిత్ర అర్జీని ఎస్పీకి అందజేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయం ఎదుట బాధితురాలు విలేకర్లతో మాట్లాడుతూ తనను మా నాన్నమ్మ కొలకలూరి రాణి పెంచింది. అయితే మా తాతా వెంకటస్వామి పేరిట 0-58 1/2 సెంట్ల పొలం ఉన్నది. అయితే మా తాత మొదటి భార్య కుమారులు, కుమార్తెలు ఆ పొలంలో నాకు రావాల్సిన వాటాని కూడా కబ్జా చేసి అమ్మి సొమ్ము చేసుకున్నారు. నా పొలాన్ని నేను అడుగుతుండగా నాపై, నాన్నమ్మపై దాడి చేస్తున్నారు. సంబంధితాధికారులు తల్లిదండ్రులు లేని తనకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

పిట్టలవానిపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే వివిధ కార్యక్రమాలలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మంగళవారం పాల్గొంటారని టీడీపీ మండల అధ్యక్షుడు ఎండి అఫ్జల్, ఇన్‌చార్జి ఎంపీడీవోలు ఎ.ఏలీషాబాబు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ఖాజీపాలెంలో ఎన్టీఆర్ పెన్షన్ భరోసా కార్యక్రమంలో, 10.30కు మంతెన సుబ్బరాజు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం, సాయంత్రం 4గంటలకు పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ఇంటింటా సర్వేకు కరపత్రాలు ఆవిష్కరణ

బాపట,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠురోగ ఇంటింటా సర్వేకు సంబంధించిన కరపత్రాలను సోమవారం కలెక్టర్ జె.వెంకటమురళి ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఏరియావైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్ధ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహమ్మద్ సాధిక్, బి.కృష్ణారెడ్డి, వివి.సుబ్రహ్మణ్యంలతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించి కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని ఆయన తెలిపారు.

రెవెన్యూ సదస్సులో 17 అర్జీలు

కర్లపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 17 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ సుందరమ్మ తెలిపారు. సదస్సులో వీఆర్వో అక్కల శివారెడ్డి, పంచాయతీ కార్యదర్శి పిల్లల సాంబశివరావు, సర్పంచ్ దేవరకొండ అంకమ్మ, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రవికుమార్, ఆర్ఐ కర్లపాలెం రాజేంద్ర, రైతులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో ఒక అర్జీ

పిట్టలవానిపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఒక అర్జీ అందినట్లు పిట్టలవానిపాలెం తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ తెలిపారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కలెక్టర్



కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను పరిష్కరించటంలో నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చిన అర్జీలను పరిష్కరించటానికి రెవెన్యూ డివిజన్ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందటానికి ప్రభుత్వ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు 2107 మంది హౌస్‌హోల్డ్ సర్వేలో విడిగా నమోదై ఉన్నారన్నారు. హౌస్‌హోల్డ్ సర్వే డేటాలో ఉద్యోగస్తుల కుటుంబ సభ్యుల పేర్లను మ్యాపింగ్ చేయాలని తెలిపారు. మిస్సింగ్ హౌస్‌హోల్డ్ డేటా అమర్తలూరు, కొల్లూరు, రేపల్లె, నగరం, భట్టిప్రోలు, చీరాల, జె.పంగులూరు, కర్లపాలెం, బాపట్ల, పివిపాలెం మండలాలలో డేటా నమోదు చేయాలన్నారు. కొల్లూరు మండలంలోని లంక గ్రామాలలో రోడ్లు, తాగునీరు సౌకర్యాలు లేవని ప్రజలు కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చారని, ఈ విషయంపై కలెక్టర్ స్పందిస్తూ జిల్లా పంచాయతీ అధికారి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్, గ్రామీణ నీటిసరఫరాల శాఖ ఇంజనీర్లు పరిశీలించి సంబంధిత పనులు చేపట్టటానికి అవసరమైన ప్రతిపాదన తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిష్కారవేదికకు ఏడు అర్జీలు

రేపల్లె, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ నిజాంపట్నం మండలం ప్రజ్జం గ్రామానికి చెందిన మిరియాల వజ్రమ్మ తమకు పీఎం కిసాన్, రైతుభరోసా మంజూరు చేయాలని కోరారన్నారు. భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామానికి చెందిన నిరుపేద వాగోలు రమేష్‌బాబు ఏదైనా సాగు భూమిని మంజూరు చేయాలని కోరారు. పెదలంక గ్రామానికి చెందిన నన్నెపాముల చంద్రశేఖర్ బాబు ఇందిరానగర్ కాలనీలో ఆర్అండ్‌బీ రోడ్డు ఇరుప్రక్కల ఆక్రమణలను తొలగించాలని కోరారు. ఓలేరు గ్రామం నుంచి గౌడపాలెంకు వెళ్ళే రహదారి ఆక్రమణకు గురైందని పలుమార్లు అర్జీలు దాఖలు చేసిన సమస్య పరిష్కరించలేదని తక్షణమే విచారించి పరిష్కరించాలని కోరారు. కొల్లూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన టి.కోటేశ్వరరావు ప్రభుత్వ డొంకకు సర్వేచేసి ఆక్రమణను తొలగించాలని కోరారు. వీటిపై విచారించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.



ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఆర్డీవోకి వినతిపత్రాన్ని అందిస్తున్న పట్టణవాసి

ప్రజా సమస్యల పరిష్కారవేదికకు అధికారులు డుమ్మా

కర్లపాలెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 23 శాఖల వారు పాల్గొనాల్సి ఉండగా ఉదయం 11 గంటల సమయం వరకు కూడా కేవలం 7 శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. పలు శాఖల అధికారులు ఏదో సమయంలో మొక్కుబడిగా వచ్చి రిజిష్టర్‌లో సంతకాలు చేసి వెళుతున్నారని ప్రజానీకం తీవ్రంగా విమర్శిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రెవెన్యూ సదస్సులకు హాజరు కాగా సీనియర్ అసిస్టెంట్ ఆనందరావు ప్రజా సమస్యల పరిష్కారవేదికలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ మల్లేశ్వరి, సీహెచ్‌వో మేరి, ఈవో భాగ్యలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

వాటర్ ప్లాంట్స్‌ను తనిఖీ చేసిన కమిషనర్



బాపట్లలోని వాటర్ ప్లాంట్‌లను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి

బాపట్ల,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని వాటర్ ప్లాంట్స్‌ను సోమవారం గుంటూరు సీనియర్ వాటర్ ఎనలిస్ట్ వి.రాజారావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డితో ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్లాంట్స్‌లో నీటి నమూనాలను సేకరించి యజమానులకు పలుసూచనలు చేశారు. ప్లాంట్ నిర్వహణకు సంబంధించి అన్ని శాఖల అనుమతులు తప్పక పొందాలన్నారు. నమూనా పరీక్షలు అనంతరం అవకతవకలు ఉన్నచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాటర్ బాటిల్స్‌లో నీరు నింపి అమ్మకూడదన్నారు. ఈ తనిఖీలలో మున్సిపల్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడిని పరామర్శించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ

బాపట్ల,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విశ్రాంత ఉపాధ్యాయుడు బి.రత్నరాజు అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకున్న ఆయన స్నేహితుడు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు బాపట్ల విచ్చేసి ఆయన ఇంటికెళ్ళి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆపదలో ఉన్న తన మిత్రుడికి అండగా ఉంటానని హామినిచ్చారు. ఆరోగ్య పరిస్థితులు గురించి అడిగి తెలుసుకొని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

వైభవంగా సరస్వతి విగ్రహావిష్కరణ



సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జనసేనపార్టీ నాయకులు కమతం సాంబశివరావు,విజయకుమారి

రేపల్లె, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : పూర్వ విద్యార్థుల కృషితో పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమని జనసేన పార్టీ నాయకుడు, కమతం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కమతం సాంబశివరావు అన్నారు. మండలంలోని పిరాట్లంక జడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థులతో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహాన్ని సోమవారం వారు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణించి తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా ముందుకు వెళ్ళాలని సూచించారు. అనంతరం పూర్వ విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిరాట్లంక సర్పంచ్ కమతం రమాదేవి, విజయకుమారి, మాజీ సర్పంచ్ మండలి రామ్మోహన్‌రావు, పి.శ్రీనివాసరావు, చెన్నుపల్లివారిపాలెం సర్పంచ్ ముత్తురెడ్డి జయరామయ్య, ఎం.రామ్మోహన్‌రావు, శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నాట్యంలో చెరుకుపల్లి విద్యార్థిని ప్రతిభ

చెరుకుపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా కూచిపూడి కళాక్షేత్రంలో 27, 28, 29న జరిగిన కూచిపూడి నాట్యపతాక స్వర్ణోత్సవాల సందర్భంగా ఈనెల 29న జరిగిన విద్యార్థుల బృంద నాట్యంలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన చెరుకుపల్లి మండలం పొన్నపల్లికి చెందిన కొత్తపల్లి అనుకృతికను ప్రముఖ కూచిపూడి నాట్యగురువు, సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత వేదాంతం రాదేశ్యామ్ ప్రశంసా పత్రం ఇచ్చి అభినందించారు. అనుకృతికను నాట్యగురువులు శేషు, గోలి శ్రావణి అభినందించారు.

అభ్యుదయ కవులలో శ్రీశ్రీ ప్రముఖులు

● ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నరసింహరెడ్డి



మాట్లాడుతున్న నరసింహరెడ్డి

బాపట్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భావకవిత్వం, చందస్సు సహిత పద్యకవిత్వం మాత్రమే సాహిత్యంగా విశ్వసించే రోజుల్లో వచన కవిత్వం కూడా గొప్ప సాహిత్యమేనని, జనాదరణ పొందగలదని నిరూపించిన అభ్యుదయ కవులలో శ్రీశ్రీ ప్రముఖులని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి వివేక సర్వీస్ సొసైటీ ఆవరణలో నెలనెల నందివర్ధనం తరతరాల తెలుగుపలుకు 96వ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివేక సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ, జాతీయ స్థాయిలో వెల్లివిరిసిన అభ్యుదయభావాలను స్వాగతించిన శ్రీశ్రీ వాడుకలో ఉన్న తెలుగు పదాలను గొప్పకూర్పు అల్లికతో తన కవిత్వాన్ని జనసామాన్యం దరికి చేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో వివేక సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ఎన్‌వీవీ నాగరాజు, ధృతి సంస్థ కార్యదర్శి చాపల సుబ్రహ్మణ్యం, సమన్వయకర్త శీలం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నరసింహారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో బాపట్ల, చీరాల, పొన్నూరు, గుంటూరు ప్రాంతాలకు చెందిన సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో బాపట్ల జిల్లాకు ప్రథమస్థానం

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కౌషల్ 2024 క్విజ్ పోటీల్లో బాపట్ల జిల్లా విద్యార్థుల బృందం ప్రథమ స్థానం సాధించారు. విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో అన్ని జిల్లాల నుంచి జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా విద్యార్థుల బృందం ప్రథమస్థానం సాధించారు. జిల్లా టీమ్‌లో కొప్పెరపాడు జడ్పీహెచ్‌ఎస్ 10వ తరగతి విద్యార్థి బత్తుల అభిరామ్, భట్టిప్రోలు పెసర్లంక జడ్పీ హెచ్‌ఎస్ 9వ తరగతి విద్యార్థిని మోర్ల తేజశ్రీ, చందోలు జడ్పీహెచ్‌ఎస్ 8వ తరగతి విద్యార్థిని బషీర్‌ల ఆయా పాఠశాలల ప్రథమ స్థానంలో నిలిచారు. పెసర్లంక విద్యార్థిని తేజశ్రీని ప్రధానోపాధ్యాయుడు మహబూబ్‌బాషా, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు అభినందించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి : సీపీఐ, సీపీఎం

బాపట్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రజల మనోభావాలను గాయపరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలంటూ సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసి, సీపీఎం రెడ్‌స్టార్ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం బాపట్ల పట్టణంలోని చీలురోడ్డు వద్ద నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లి విల్సన్, సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసి జిల్లా సహాయ కార్యదర్శి ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి సింగరకొండ, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

● కొల్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అహంకార వ్యాఖ్యలను దళిత, ప్రజా సంఘాలు, సీపీఎం నాయకులు తీవ్రంగా ఖండించారు. కొల్లూరు సంజీవయ్య నగర్‌లో సోమవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు టి.సురేష్, బొనిగల సుబ్బారావు, కూచిపూడి మోషే తదితరులు పాల్గొన్నారు

● భట్టిప్రోలు చావలి సెంటర్‌లో సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఐ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పి.నాగాంజనేయులు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.సుధాకర్, నాయకులు మురుగుడు సత్యనారాయణ, దీపాల సత్యనారాయణ, బసవయ్య, మనోజ్‌కుమార్, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బాలాజీ, వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీను, సీపీఎం, సీపీఐ నాయకులు నాగమల్లేశ్వరరావు, శంకరరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో అయిదు బంగారు పతకాలు

బాపట,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసాయపాలెం గ్రామానికి చెందిన విశ్రాంత పీడీ కుంభా సాంబశివరావు, సురేంద్రలు రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో 5 బంగారు పతకాలు సాధించారు. ఈనెల 28, 29 తేదీలలో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలలో హైజంప్, షార్ట్‌పుట్, పోల్‌వాల్ట్‌లో సాంబశివరావుకు మూడు బంగారు పతకాలు లభించాయి. లాంగ్ జంప్‌లో సురేంద్రకు రెండు బంగారు పతకాలు, హైజంప్, పోల్‌వాల్ట్‌లో రెండు వెండిపతకాలు సాధించారు. వీరు జనవరి నెలలో కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఐఆర్ఎస్ అధికారి కుంభా శివకృష్ణ, ఐపీఎస్ అధికారి దేవరకొండ నాగరాజు, గ్రామసర్పంచ్ దాసి హైమావతి, మాజీ సర్పంచ్ ముప్పలనేని నాగరాజు, గట్టుపల్లి ఇజ్రాయిల్, దొప్పలపూడి పూర్ణకుమారి, జెట్టి దినేష్, ముప్పలనేని రామారావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వినీతలు అభినందించారు.

కోట బ్రహ్మయ్యకు సన్మానం

బాపట్లరూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఎన్నికలలో ట్రెజరర్‌గా గెలుపొందిన కోట బ్రహ్మయ్యను బులియన్ జ్యూయలరీ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతిష్ఠను పెంచేలా తన బాధ్యతగా వ్యవహరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బొమ్మిశెట్టి హరినాథ మురళి, అధ్యక్షుడు వెదుపర్తి లక్ష్మణమూర్తి, సెక్రటరి దొడ్డా రామకృష్ణ, ట్రెజరర్ నాళం నరేష్, జాయింట్ సెక్రటరి మోదడుగు నరేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి : ఎస్పీ



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని ఎస్పీ తుషార్‌డూడి పోలీసు అధికారులను హెచ్చరించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. భూవివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థికలావాదేవీల మోసాలు వంటివి పలుసమస్యలపై 40మంది తమ అర్జీలను అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకొని వాటిపై చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, పీజీఆర్ఎస్‌సెల్ ఎస్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు, కొల్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సోమవారం బాధితులకు పంపిణీ చేశారు. భట్టిప్రోలు మండలం రాచూరు గ్రామానికి చెందిన రావూరి పద్మజకు రూ.1,00,555, వేమూరు మండలం చావలి గ్రామానికి చెందిన ప్రసాదం నాగమల్లేశ్వరికి రూ.45,350 చెక్కులు అందించారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



అబ్దుల్‌బిలాల్ అహ్మద్‌కు చెక్కును అందిస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : ఆర్థికంగా స్తోమత లేక వైద్యం చేయించుకోలేని పేదవారికి టీడీపీ ప్రభుత్వం ముందుంటుందని అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం చెరుకుపల్లి మండలం కనగాల గ్రామానికి చెందిన అబ్దుల్‌బిలాల్ అహ్మద్ అనారోగ్యంతో బాధపడుతుంటే రూ.లక్షా 618ల చెక్కును అందించారు. అనంతరం మరికొంత మందికి చెక్కులను అందజేశారు.

క్రీడల్లో బంగారు పతకం సాధించిన పీఈటీకి సత్కారం

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : 60 ఏళ్ల వయసులో లాంగ్ జంప్ క్రీడల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించిన వ్యాయామ ఉపాధ్యాయుడిని ఎంపీపీ సత్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న తమ్మా శ్రీనివాసరెడ్డి 60+ వయసు గ్రూపులో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్‌జంప్‌లో గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. వ్యాయామ ఉపాధ్యాయుడిని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రావూరి లలితకుమారి దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, ఎంఈవో దేవరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివరామకృష్ణ, ఏవో జలజ, ఏపీఎం శ్రీమన్నారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

2025 HAPPY NEW YEAR

న్యూ.. జోష్


విద్యుత్ వెలుగుల్లో గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో వెంకటేశ్వరస్వామి దేవాలయం

కొత్త ఏడాది అంటే.. కొత్త ఆశలు.. కొంగొత్త ఆకాంక్షలు.. సరికొత్త ఆలోచనలు! గతం తాలూకు చేదు అనుభవాలను మరిచిపోయి.. మంచిని పంచుకుంటూ కొత్త ఏడాదిలో అడుగుపెట్టే అద్భుతమైన పండుగరోజు.. జనవరి 1. అందుకే కులమతాలకు అతీతంగా అందరూ న్యూ ఇయర్ వేడుకలు జరుపుకుంటారు. అది పేరుకు ఆంగ్ల సంవత్సరాదే అయినా.. అందరి సొంత పండుగలా మారిపోయింది. ప్రతి ఇంట్లో సందడి చేస్తోంది. ఎప్పటిలాగే ఈ కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం పలికేందుకు అందరూ సిద్ధమవుతున్నారు. చిన్నారులు మొదలు.. పెద్దల వరకూ అందరూ కొత్త ఏడాది.. కొత్త వెలుగులను జీవితంలోకి ఆహ్వానించేందుకు ఎవరెవరి స్థాయిలో వారు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

- ఆంగ్ల సంవత్సరాది ఆహ్వానానికి భారీ ఏర్పాట్లు
- చిన్నా.. పెద్ద వయోభేదం మరిచి కొత్త ఏడాది సందళ్లు
- కార్యాలయాలు, విద్యాసంస్థల్లో భారీ కార్యక్రమాలకు ఏర్పాట్లు
- కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు
- పాత మిత్రుల గెట్ టూ గెథర్లు.. మందుబాబుల సిట్టింగులు
- అందమైన రంగవల్లులతో మహిళల స్వాగతాలు

గుంటూరు, డిసెంబరు, 30 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాది వేడుకల్లో కుర్రకారుది ప్రత్యేకమైన స్థానం. యువకులంతా ఒక్కచోటికి చేరి చేసే సందడి అంతా ఇంతా కాదు. కొత్త ఏడాదికి ముందు రోజు నుంచే వారి సందడి మొదలవుతుంది. నేటి సాయంత్రం నుంచే వారి సం దడి కనిపిస్తుంది. బైకులను రయ్.. రయ్.. మనిపిస్తూ, కేరింతలు కొడుతూ రోడ్లపై వారు చేసే సందడి అంతా ఇంతా కాదు.. ఈ ఏడాది వారి సందడి మరింత ఇనుమడించింది. కూడళ్లలో భారీ కేకులు ఏర్పాటుచేసుకుని వాటిని కట్ చేసి కొత్త ఏడాదిని స్వాగతించేందుకు వారు భారీ ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కార్యాలయాల్లో సందడి..

పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు న్యూ ఇయర్ వేడుకలకు సిద్ధమయ్యాయి. కార్యాలయాలను అందంగా అలంకరించుకోవడంతో మొదలైన న్యూ ఇయర్ వేడుకలు జనవరి 1వ తేదీ కేక్ కటింగు వరకూ అట్టహాసంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. విద్యాసంస్థల్లో జరిగే న్యూ ఇయర్ వేడుకల సంగతి సరేసరి.. చిన్నారుల నృత్యాలు, పాటలు, మ్యూజికల్ నైట్లు వంటి పలు ప్రత్యేక కార్యక్రమాలతో కొత్త ఏడాది సంబరాలు అంబరాన్ని అంటనున్నాయి.

గేటెడ్ సందడి!

గతంలో ఎన్నడూ లేని విధంగా గేటెడ్ కమ్యూనిటీల్లో న్యూ ఇయర్ వేడుకలు జరుగుతున్నాయి. కమ్యూనిటీలోని కుటుంబాలన్నీ తర, తమ భేదాలు మరిచి న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొంటున్నారు. దీంతో కొత్త ఏడాది జోష్ మరింత పెరుగుతోంది. పురుషులు, మహిళలు, చిన్నారులు విడివిడిగా, కలివిడిగా కార్యక్రమాలు రూపొందించుకుని సంబరాలు జరుపుకుంటూ కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతున్నారు. పాత మిత్రులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్ గెట్ టూ గెదర్లు ఏర్పాటు చేసుకుని ఇండోర్ గేమ్స్, అంత్యాక్షరులతో సంతోషంగా గడుపుతున్నారు. మహిళలు కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు డిసెంబరు 31 సాయంత్రం నుంచే తమ ఇళ్ల ముందు అందమైన రంగులతో ముగ్గులు వేయడంలో తలమునకలైపోయారు.

ఆంగ్ల సంవత్సరాది క్రైస్తవ సోదరులకు చాలా ప్రత్యేకమైనది. క్రిస్మస్ వేడుకలకు ఇచ్చినంతగా న్యూ ఇయర్ వేడుకలకు వారు ప్రాధాన్యమిస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి చర్చిలకు వెళ్లి రాత్రంతా ఆధ్యాత్మిక చింతనలో గడుపుతారు. అక్కడే కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని సందడి చేస్తారు.


మందుబాబుల హడావుడి

న్యూ ఇయర్ వేడుకల్లో మందుబాబుల హడావుడి అంతా ఇంతా కాదు. కొత్త ఏడాది స్వాగత వేడుకల్లో అందరిదీ ఒక ఎత్తైతే.. మందుబాబులది ఒక ఎత్తు. వారం పదిరోజుల ముందు నుంచే వారు సిట్టింగుల కోసం ఏర్పాట్లు చేసుకున్నారు. డిసెంబరు 31వ తేదీ సాయంత్రానికే ఆత్మీయులు, మిత్రులు అందరూ ఒకచోటికి చేరి మందు, చిందులతో సందడి చేసుకోవడం మొదలు పెట్టారు.



దుకాణాల్లో ఏర్పాటుచేసిన కేకులు

కోటయ్యస్వామి చెంతకు చంద్రబాబు ఆరోసారి



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కోటప్పకొండ కోటయ్య స్వామి సన్నిధికి చంద్రబాబు రావడం ఇది ఆరోసారి. కోటప్పకొండ అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారు. నవ్యాంధ్రప్రదేశ్ తొలి శాసన సభాపతి డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు కోటప్పకొండ అభివృద్ధికి విశేషంగా కృషి చేసి భక్తుల ప్రశంసలందుకున్నారు. కోటప్పకొండ అభివృద్ధికి కోడెల ప్రతిపాదించిన ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి వెనువెంటనే ముఖ్యమంత్రిగా చంద్రబాబు పెద్దఎత్తున నిధులు కేటాయించారు. కోటప్పకొండ పుణ్య క్షేత్రంగా.. పర్యాటకేంద్రంగా అభివృద్ధి చెందింది. కోటప్పకొండ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి చెందింది. కోటప్పకొండకు ఘాట్ రోడ్డు నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శంకుస్థాపన చేశారు. తెలుగుదేశం ప్రభుత్వమే ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయగా సీఎం చంద్రబాబు దీనిని ప్రారంభించారు. ఘాట్ రోడ్డులో పర్యాటక కేంద్రం నిర్మించారు. కోటయ్య స్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులను చంద్రబాబు ప్రారంభించారు. ఆలయ నిర్మాణం చేసి మహాకుంభాభిషేకానికి కూడా చంద్రబాబు హాజరయ్యారు. 2014 - 2019 మధ్య సీఎంగా ఉన్న చంద్రబాబు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలకు రెండు సార్లు కోటప్పకొండకు వచ్చారు. యలమందలలో పింఛన్ కార్యక్రమానికి హాజరవుతున్న చంద్రబాబు ఆరోసారి శ్రీత్రికోటేశ్వర స్వామిని దర్శించుకోనున్నారు. ఇందుకోసం దేవదాయ శాఖ దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఏర్పాట్లను ఈవో డీ చంద్రశేఖరరావు పర్యవేక్షిస్తున్నారు.

సీఎం షెడ్యూల్ ఇలా..

యలమందల గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన షెడ్యూల్‌ను అధికారులు తెలిపారు.

- ఉదయం 10.30 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి పల్నాడు జిల్లాకు బయలుదేరుతారు.
- 10.50 గంటలకు నరసరావుపేట మండలం, యలమందల గ్రామానికి చేరుకుంటారు.
- 11.00 నుంచి 11.30 వరకు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారు.
- 11.35 నుంచి 12.35 వరకు వేదిక వద్ద గ్రామస్తులతో ముచ్చటిస్తారు.
- మధ్యాహ్నం 12.40 నుంచి 1.00 వరకు పల్నాడు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు
- 01.30 గంటలకు యలమందల నుంచి రోడ్డు మార్గంలో కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానానికి బయలు దేరుతారు.
- 1.45 నుంచి 2.15 గంటల మధ్య చంద్రబాబు శ్రీత్రికోటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు.
- 2.15 గంటలకు కోటప్పకొండ నుంచి బయలుదేరుతారు.
- 2.30 గంటలకు రోడ్డు మార్గంలో యలమందలలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 2.35 గంటలకు హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో ఉండవల్లిలోని తన నివాసానికి చంద్రబాబు బయలుదేరుతారు.
- 2.55 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.


ఐదేళ్ల నిరాశ.. సీఎం మీదే ఆశ

- పల్నాడు అభివృద్ధిపై ప్రజల ఎదురు చూపులు
- జిల్లాపై సీఎం చంద్రబాబు వరాలు కురిపించేనా


వినుకొండ మునిసిపాల్టీలో నిలిచిపోయిన నీటి పథకం పనులు


సీఎంగా చంద్రబాబు 2018లో ప్రారంభించిన ములకలూరు వద్ద ముస్లిం బాలికల హాస్టల్


పెద తురకపాలెం వద్ద నిలిచిపోయిన ముస్లిం విద్యార్థుల రెసిడెన్షియల్ స్కూల్ భవనం


కోటప్పకొండలో నిలిచిపోయిన రోప్‌వే పనులు

ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా పల్నాడు జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం వరాల కోసం జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఒక్క అభివృద్ధి పనులు జరగక నిరాశతో ఉన్న ప్రజలకు సీఎం ఎలాంటి హామీలు ఇస్తారో అనే చర్చ జిల్లా వ్యాప్తంగా నడుస్తోంది. వైసీపీ ప్రభుత్వం హయాంలో అన్ని రంగాలు కోలుకోని విధంగా దెబ్బతిన్నాయి. అభివృద్ధి అటకెక్కింది. రైతులు.. కార్మికులు.. విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో గాడి తప్పిన పల్నాడు జిల్లా ప్రగతిని పునరుద్ధరిస్తారన్న ఆశతో జిల్లాలో ఎంపీ, ఏడుగురు ఎమ్మెల్యే కూటమి అభ్యర్థులను రికార్డు స్థాయి మెజార్టీతో ప్రజలు గెలిపించారు. జిల్లా ప్రగతిపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెడతారని జిల్లా వాసులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాపై వరాలు కురిపిస్తారని ఆశిస్తున్నారు. జిల్లాలో సమస్యలు కోకొల్లలుగా ఉన్నా ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టులే కీలక సమస్య. నాడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రారంభించిన సాగు నీటి ప్రాజెక్టులు గత ఐదేళ్లు నిధులు లేక నిలిచిపోయాయి. చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో తాగు.. సాగు నీటి ప్రాజెక్టులు పూర్తవుతాయని రైతులు.. ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల ప్రజలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన వరికపూడిశెల ప్రాజెక్టు వైసీపీ ప్రభుత్వ హయాంలో పథకం పనులు అడుగు కూడా ముందుకు సాగలేదు. ఈ పనులకు నాడు సీఎంగా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు.
- గురజాల నియోజకవర్గంలో సాగునీటి ఎద్దడి నివారణ కోసం ఏర్పాటు చేయనున్న తంగెడ, మాచవరం ఎత్తిపోతల పథకాలకు నిధుల్లేవు. దాదాపు 21,473 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ఈ పథకాలను రూపొందించారు.
- జిల్లాలో తాగు నీటి సరఫరా సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రకటించిన వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణం నేటికీ చేపట్టలేదు. ఎంతో అర్భాటంగా ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం ప్రకటించి నిర్మాణాన్ని విస్మరించింది.
- తాగు, సాగు నీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలోని బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంచాలని దశాబ్దాలుగా జిల్లా వాసులు కోరుతున్నారు. నాడు తెలుగుదేశం ప్రభుత్వం బుగ్గవాగు అభివృద్ధికి రూ.202 కోట్లు మంజూరు చేసింది. బుగ్గవాగు సామర్థ్యంను 3.5 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు పెంచుతామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించి చతికిల పడింది.
- నాగార్జున సాగర్ కుడి కాలువ ఆయకట్టులో నెలకొనే సాగునీటి సంక్షోభం నివారణకు గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను కుడికాలువకు తరలించేందుకు నాడు టీడీపీ ప్రభుత్వం పథకం రూపొందించింది. ఈ పథకానికి వైఎస్ఆర్ పల్నాడు కరువు నివారణ పథకంగా పేరు మార్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. నదుల అనుసంధానంలో భాగంగా గోదావరి జలాలు కుడికాలువకు తరలింపు పనులు 2026 జూన్ కల్లా పూర్తి చేస్తామని సీఎం ఇటీవల ప్రకటించడంతో ఈ పథకంపై అన్నదాతల్లో ఆశలు చిగురించాయి.
- కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలను పాడు పెట్టారు. ముస్లిం మైనార్టీ విద్య కోసం వెచ్చించిన రూ.8.12 కోట్లు నిరూపయోగంగా మారాయి. బాలికల వసతి గృహాన్ని నాడు సీఎం చంద్రబాబు ప్రారంభించారు. నరసరావుపేట మండలం ములకలూరు వద్ద నిర్మించిన బాలుర, బాలికల వసతి గృహాలు, ఐటీఐ కళాశాలను వినియోగంలోకి తీసురాలేదు.
- ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధికి తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన రోప్‌వే నిర్మాణం నిలిచిపోయింది. ఈ పథకానికి నాడు సీఎం చంద్రబాబు 2018 ఫిబ్రవరి 17న శంకుస్థాపన చేశారు.

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ.6.82 కోట్ల నిధులు మంజూరు చేసి రోప్‌వే నిర్మాణ పనులను నాడు ప్రారంభించారు. ఈ పనులను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. ప్రభుత్వం ఇటీవల నూతన పర్యాటక పాలసీని ప్రకటించింది. పర్యాటక కేంద్రాలు, ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి ప్రణాళికను విడుదల చేసింది. నూతన పాలసీలో కోటప్పకొండకు చోటు దక్కలేదు. కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధిలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే తిరునాళ్ల దేశ ప్రసిద్ధి. తిరునాళ్లకు రాష్ట్ర పండగ హోదాను ప్రభుత్వం కల్పించింది. దీనికి ప్రత్యేకంగా నిధులు కేటాయింపు ఏటా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు కాకినాడ జేఎన్‌టీ యూనివర్సిటీ అధ్యాపకులను నియమించలేదు. అతిథి అధ్యాపకులతో కాలం గడుపుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వం కళాశాలకు 80 అధ్యాపక పోస్టులను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి రూ. 7.11 కోట్ల వార్షిక బడ్జెట్‌ను నాడు కేటాయించింది. తొమ్మిది మంది ప్రొఫెసర్‌లు, 53 అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, 18 అసోసియేట్ ప్రొఫెసర్‌లను కళాశాలకు మంజూరు చేస్తూ జీవోను విడుదల చేసింది. ఈ మేరకు అధ్యాపకులను యూనివర్సిటీ నేటికీ నియమించలేదు. 73 మంది అధ్యాపకుల కొరత ఉంది. నామమాత్రంగా కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించి వర్సిటీ చేతులు దులుపుకుంది.


నరసరావుపేట మార్కెట్ యార్డులో నిలిపిపోయిన శీతల గోదాము


అసంపూర్తిగా నిర్మించిన నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల భవన సముదాయం

బీసీ వసతిగృహాల్లో.. డిజిటల్ పాఠాలు

- వారం రోజుల్లో ప్రారంభానికి సన్నాహాలు
- సబ్జెక్టుల వారీగా బోధన

గుంటూరు(విద్య), డిసెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి జిల్లాలోని బీసీ సంక్షేమశాఖ హాస్టల్స్‌లో డిజిటల్ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా తొలి విడత ఉమ్మడి జిల్లాలో నాలుగు హాస్టల్స్‌లో బోధనకు ప్రభుత్వ ప్రణాళికలు సిద్ధం చేయగా ఇప్పటికే డిజిటల్ స్క్రీన్స్, ఇతర సాంకేతిక పరికరాలు జిల్లాకు వచ్చాయి. తొలి విడతగా తాడికొండ, పెదకాకాని, చేబ్రోలు, అన్నపర్రులో డిజిటల్ తరగతులు ప్రారంభం కానున్నాయి. తరువాత క్రమంగా అన్ని హాస్టల్స్‌లో ఇవి ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 54 హాస్టల్స్ ఉన్నాయి. ఇందులో 43 బాలుర కోసం మరో 11 బాలికల కోసం కేటాయించారు. ఆయా హాస్టల్స్‌లో దాదాపు 5వేలమందికి పైగా విద్యార్థిని విద్యార్థులు 3వ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇందులో పదవ తరగతి చదివే విద్యార్థులు 800 పైగా ఉన్నారు. ఆయా విద్యార్థులకు గణితం, ఆంగ్లం, హిందీ, సైన్స్ తదితర సబ్జెక్టుల్లో మెరుగైన బోధన అందించడమే లక్ష్యంగా ఈ డిజిటల్ తరగతులు ప్రారంభం కానున్నాయి.


డిజిటల్ స్క్రీన్

నిర్లక్ష్యాన్ని వదిలి డిజిటల్ వైపు అడుగులు....

బీసీ సంక్షేమహాస్టల్స్ వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురి అయ్యాయి. విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో విఫలం అయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మోటిక్స్ చార్జీల చెల్లింపు, నెలనెలా డైట్‌చార్జీల చెల్లింపు తీవ్రజాప్యం చేశారు. కొన్ని హాస్టల్స్‌లో వార్డెన్లు అప్పులుచేసి భోజనం పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. హాస్టల్‌లో రాత్రి పూట విద్యార్థుల్ని చదివించడానికి 2019కి ముందు ప్రత్యేకంగా ట్యూటర్‌ను నియమించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ట్యూటర్స్ నియామకం అటకెక్కింది. తాజాగా ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పదిలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా బోధకుల్ని నియమించాలని యోచిస్తున్నారు. పాఠశాల నుంచి వచ్చిన తరువాత హాస్టల్ ఈ డిజిటల్ క్లాసులు ప్రారంభిస్తారు. సబ్జెక్టుల వారీగా బోధనతోపాటు సందేహాలు నివృత్తిచేస్తారు. ఇందుకోసం హాస్టల్‌లో ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించి అక్కడ ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డు ఏర్పాటుచేస్తారు. బోధించే ట్యూటర్‌కు గౌరవ వేతనంగా రూ. 1500 నుంచి రూ.2వేలు ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న నేపథ్యంలో కొత్తగా ఏర్పాటు అయ్యే ఈ డిజిటల్ క్లాసుల ఏర్పాటుకు ప్రత్యేక కసరత్తు చేస్తున్నారు.

నీటి తొలగింపు పనులు ముమ్మరం



నీటిని తొలగించేందుకు ఏర్పాటు చేసిన భారీ మోటార్లు

గుంటూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని శాశ్వత సచివాలయ భవనాల పునాదుల్లో నిలిచిపోయిన నీటిని తొలగించే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన నీటి తొలగింపు కార్యక్రమాన్ని సీఆర్డీఏ అధికారులు మరింత ముమ్మరం చేశారు. సాధ్యమైనంత త్వరగా సెక్రటేరియట్ భవన సముదాయ పునాదుల నుంచి నీటిని తొలగించేందుకు వీలుగా భారీ మోటార్లను తెప్పించి నీటిని తోడుతున్నారు. భారీ మోటార్లు నిరంతరాయంగా పనిచేస్తున్నా నీరు తరగడం లేదు. దీంతో మరిన్ని మోటార్లు తెప్పించి నీటిని తోడివేయించాలన్న యోచనలో సీఆర్డీఏ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

వైసీపీ రద్దు చేసిన 16 గిరిజన సంక్షేమ పథకాలు
పునరుద్ధరించండి

- సీఎం చంద్రబాబుకు ధారూనాయక్ వినతి

గుంటూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన 16 గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం ధారూనాయక్ సీఎంను కోరారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఆయన సచివాలయంలో సీఎం చంద్రబాబును కలసి వినతి పత్రం అందించారు. గత వైసీపీ ప్రభుత్వం గిరిజనులను వంచించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ పథకాలు రద్దు చేయడంతో గిరిజనులు విద్య, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమ రంగాల్లో తీవ్రంగా నష్టపోయారన్నారు. వారి జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గిరిజనుల ఆర్థికాభివృద్ధి జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వంలో గిరిజనులకు జరిగిన ద్రోహాన్ని వారు జీవితాంతం మరువలేరన్నారు. ఇందుకు స్పందించిన సీఎం చంద్రబాబు ఆయా పథకాలను పునరుద్ధరించి గిరిజనులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.


సచివాలయంలో సీఎం చంద్రబాబుకు గిరిజన సమస్యలు వివరిస్తున్న ధారూనాయక్

ఒంటరి వృద్ధురాళ్లే.. టార్గెట్

వరస ఘటనలతో ఆందోళన

మత్తు ఇచ్చి దోపిడీకి పాల్పడుతున్న దుండగులు

తాజాగా సమతానగర్‌లో ఘటన

ఒంగోలు(క్రైం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాళ్లే లక్ష్యంగా దోపిడీల పరంపర కొనసాగుతోంది. ఇద్దరు వృద్ధులు దోపిడీ దొంగల బారిన పడి హత్యకు గురికాగా, ఇద్దరు చావు అంచుల వరకు వెళ్లి బయటపడ్డారు. ఇలాంటి వరస సంఘటనలతో జిల్లా ప్రజానీకం ఆందోళనకు గురవుతున్నారు. ఎనిమిది నెలల వ్యవధిలో జిల్లాలో వరుసగా చోటుచేసుకున్న సంఘటనలు మిస్టరీగా తయారయ్యాయి. ముఖ్యంగా ఒంగోలుతోపాటు పరిసర ప్రాంతాలలో ఈ రకం దోపిడీలు జరగడం పోలీసులకు సవాల్‌గా మారాయి. ఇప్పటికి జరిగిన ఘటనలలో ఎలాంటి క్లూ దొరకకపోవడంతో పోలీసులు తలలు పట్టుకున్నారు. ఒంటరిగా జీవిస్తున్న పండుటాకులు, కన్నబిడ్డలకు సైతం దూరంగా ఉంటున్న వారిని టార్గెట్‌గా చేసుకొని దోపిడీ దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. వృద్ధులకు మత్తుమందు ఇచ్చి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు అపహరించుకెళుతున్నారు. అనుమానం వస్తే దాడులకు పాల్పడుతున్నారు. అదేసమయంలో వృద్ధులు మత్తుమందు ఘాటుకు తట్టుకోలేక మృత్యువాతపడుతున్నారు. కాగా పదిరోజులు కిందట ఒంగోలులోని సమతానగర్‌లో జరిగిన దోపిడీ ఘటనతో మహిళలే ఈ దోపిడీలను పాల్పడుతున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఇటీవల జరిగిన వరస ఘటనలు...

- ఒంగోలు అంబేద్కర్ భవన్ సమీపంలో నివాసముంటున్న తిరుమలశెట్టి పార్వతమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. మే 24న ఆమె శరీరంపై పెద్దగా గాయాలు ఏమి లేవు. మామిడికాయ తింటూ ఇంట్లో మృతిచెందింది. ఆమె వద్ద ఉన్న బంగారం ఆభరణాలు దోపిడీ దొంగలు అపహరించుకెళ్లారు. అదేసమయంలో ఇంట్లో ఉన్న బీరువాను పెకలించారు. దీంతో ఇరుగుపొరుగు వారు గుర్తించి ఆసుపత్రిలో చేర్చగా ఆమె చికిత్సపొందుతూ మృతిచెందింది.

-అదే తరహాలో జూన్ 18న ఒంగోలు రూరల్ మండలం ఉలిచిలో ఓ వృద్ధురాలు రాత్రివేళ వరండాలో నిద్రిస్తుండగా దొంగలు మత్తు మందును ఇచ్చి ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు అపహరించుకు వెళ్లారు. తెల్లవారిన తర్వాత చుట్టుపక్కల వారు వచ్చి చూస్తే అప్పటికే వృద్ధురాలు మృతిచెంది ఉంది.

-కొత్తపట్నం మండలం మడనూరులో జూన్ 26న పట్టపగలు ఆళ్ల కృష్ణవేణమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా ఉండగా గుర్తుతెలియని మహిళ ఇంట్లో ఉన్న నిమ్మచెట్టు కాయలు కావాలని వచ్చింది. అక్కడ ఏమి జరిగిందో గాని కొద్దిసేపటికి వృద్ధురాలు స్పృహ కోల్పోయింది. ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. అక్కడ కూడా ఒంగోలు అంబేద్కర్ భవనం వద్ద జరిగినట్లు బీరువా పగలకొట్టి ఉంది. అయితే కృష్ణవేణమ్మను ఆమె బంధువులు గుర్తించి ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం కోలుకుంది.

వృద్ధురాలికి మత్తు మందు ఇచ్చి దోపిడీ

తాజాగా పదిరోజుల క్రితం ఒంగోలులో మరో ఘటన చోటుచేసుకుంది. ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చిన ఓ మహిళ.. వృద్ధురాలికి మత్తు మందు ఇచ్చి ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లింది. స్థానిక సమతానగర్‌లో వృద్ధురాలు(65) నివాసం ఉంటుంది. ఆమెకు ఇద్దరు సంతానం. ఆమె ఒక్కరే ఇంట్లో ఉంటుంది. ఇంట్లో మొదటి అంతస్తు ఖాళీగా ఉంది. ఈనెల 19వతేదీన ఓ మహిళ ఇల్లు అద్దెకు కావాలని వృద్ధురాలితో అడిగింది. ఆమె ఒంటరిగా ఉండటం గమనించింది. ఇల్లు చూసుకున్న తరువాత రేపు వస్తానని చెప్పి వెళ్లింది. మరుసటి రోజు తిరిగి వచ్చిన ఆ మహిళ, వృద్ధురాలితో మాటలు కలిపింది. ఆమెకు వేరుశనగ ముద్ద ఇచ్చి తినాలని చెప్పింది. తరువాత కొద్దిసేపటికి వృద్ధురాలు మత్తులోకి జారుకుంది. దీంతో ఆమె వద్ద ఉన్న ఆరు సవర్ల ఆభరణాలు తీసుకుని ఉడాయించింది. ఆరోజు సాయంత్రం వృద్ధురాలి ఇంట్లో లైట్లు వెలగకపోవడాన్ని ఇరుగుపొరుగు వారు గుర్తించి వెళ్లిచూడగా మత్తుగా పడుకొని ఉంది. ఈమేరకు సమాచారం ఇవ్వగా ఆమె కుమారుడు వచ్చి ఆసుపత్రికి తరలించారు. ఐదు రోజుల తరువాత స్పృహలోకి వచ్చిన వృద్ధురాలు జరిగిన విషయం చెప్పడంతో తాలూకా పోలీసులకు ఆమె కుమారుడు ఫిర్యాదుచేశాడు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీలను సేకరిస్తున్నారు.

ఆ మహిళ ఎవరు?

మడనూరులో కృష్ణవేణమ్మ ఇంటికి వచ్చిన గుర్తుతెలియని మహిళ ఎవరు అనేది ఇంతవరకు గుర్తించలేకపోయారు. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిమ్మకాయలు కావాలి అని వచ్చిన మహిళ వృద్ధురాలు స్పృహకోల్పోయిన తర్వాత ఆభరణాలు, నగదు కోసం బీరువా పగలకొట్టిందా అనేది అంతు చిక్కడం లేదు. మహిళతోపాటుగా ఇంకా ఎవరైనా ఉన్నారా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. కాగా అదే తరహాలో ఒంగోలు సుజాతానగర్‌లోనూ దోపిడీ జరిగింది. ఇందులోనూ మహిళే వచ్చినట్లు వృద్ధురాలు చెబుతున్నారు. మడనూరు కేసులో మాత్రమే కొద్దిపాటి క్లూ పోలీసులకు దొరికింది. ఇలా వరస ఘటనలకు కారణం ఒకే ముఠానా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రజెండా.. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే..

ప్రభుత్వాలు మారుతున్నా పేదల బతుకులు మారడంలేదు

సీపీఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభలో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

చీరాలటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఎర్రజెండా ఎగురుతూనే ఉంటోందని, ప్రభుత్వాలు మారుతున్నా పేదల బతుకులు మారడంలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. సోమవారం చీరాల పట్టణంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభ బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల శామ్యేల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ పదేళ్లుగా అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం పేదరికం, నిరుద్యోగ సమస్య పరిష్కారంవైపు కన్నెత్తి చూడలేదని ఆరోపించారు. రైతన్నలు కూడా సమస్యలతో కుమిలిపోతూ ఆవేదన చెందుతున్నట్లు చెప్పారు. బాలికలు, స్త్రీలపై దాడులు పేట్రేగిపోతున్నట్లు పేర్కొన్నారు. దేశమంతా పర్యటిస్తున్న ప్రధాని మోదీకు మణిపూర్ గోడు కానరాలేదా అని ప్రశ్నించారు. సాక్షాత్తు పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానిస్తే అధికార పార్టీ లేక ప్రతిపక్ష నేతలు ఎవరూ కూడా పన్నెత్తి మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. జగన్ పాపాలు శాపాలుగా మారి స్మార్ట్ మీటర్లు ఏర్పడినట్లు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. వెంటనే స్మార్ట్ మీటర్లు నిరోధించాలని డిమాండ్ చేశారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించాలని కోరారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ జనవరి 2 నుంచి 10వ తేదీ వరకు అర్జీలు స్వీకరించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు చెప్పారు. స్థానిక వైద్యులు గుంటుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ శ్రామికుల శ్రమను గుర్తించిన పార్టీ సీపీఐ అని చెప్పారు. ఇటీవల జాతీయస్థాయిలో అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన అడిగోపుల సాంబశివరావును సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకట సుబ్బయ్య, జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, మేడా వెంకటరావు, ఊటుకూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలంటూ వామపక్షాలు ర్యాలీ

మార్టూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించారంటూ సోమవారం మార్టూరులో వామపక్షాలు నిరసన ర్యాలీ నిర్వహించారు. వామపక్షాల మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో అమిత్‌షా రాజీనామా చేయాలి, క్షమాపణలు చెప్పాలని అంటూ నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు, బోడెంపూడి సూరిబాబు, ఎనికపాటి రాంబాబు, మొఘల్ ఇబ్రహీం, మురుగుల చిన్నా, సుజాత పాల్గొన్నారు.

చినగంజాంలో...

చినగంజాం అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఎం నేత జి.ప్రతాప్‌కుమార్, రిక్షా కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అనిల్, జి.పుల్లారావు, కె.రమేష్, జి.యాకోబు, ప్రకాష్, రవితేజ, జెస్సీబాబు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

2024.. భలే మార్పు

రాజకీయం పూర్తిగా మారిపోయింది. ఈ ఏడాదిలో పాలకులు మారటమే కాదు పాలన తీరుతెన్నులు మారిపోయాయి. నేతల్లో కొందరికి చేదు అనుభవాలు ఎదురైతే మరికొందరికి రాజసం దక్కింది. ఇంకొందరిని అదృష్టదేవత వరించింది. తద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయ పుటల్లో 2024 ఒక ప్రత్యేక స్థానాన్ని పొందగలిగింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ఏడాది ఆరంభంలో ప్రజలను భయకంపితులను చేసిన భూఆక్రమణలు, రాజకీయ పైరవీలు, అక్రమకేసులు, రాజకీయ రౌడీయిజం లాంటి ఘటనలు కరుమరుగై సహజసిద్ధమైన పాలన వచ్చింది. వ్యవస్థలన్నీ గాడిలో పడ్డాయి. ఇందుకు పోలీసు శాఖనే నిదర్శనం. తారుమారైన రాజకీయ నాయకుల చరిత్రలు అంతకుమించి పాలక పక్షంలో జిల్లాకు అత్యధిక పదవులు దక్కటం ముఖ్యమైన రాజకీయ ఘట్టంగా చెప్పుకోవచ్చు.

- తారుమారైన రాజకీయం
- అనూహ్య విజయాలు కూటమి సొంతం
- జిల్లాలో టీడీపీకి పూర్తి ఆధిక్యత
- వైసీపీకి ఊహించని ఎదురుదెబ్బ
- పట్టు కోల్పోయిన ఆ పార్టీ నేతలు
- కీలక నాయకులకు కలసిరాని కాలం
- మారిన పాలన తీరుతెన్నులు
- గాడిలో పడిన అన్ని వ్యవస్థలు
- పదవులలోనూ జిల్లా ప్రాధాన్యం
- చాలా ప్రత్యేకమైన ఏడాది ఇది

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లా ఏర్పాటు అనంతరం పరిశీలిస్తే ఈ ఏడాది రాజకీయంగా చాలా ప్రత్యేకమైంది. రమారమీ రెండు దశాబ్దాల అనంతరం ఉమ్మడి జిల్లాలో తెలుగు దేశం పార్టీకి పూర్తి ఆధిక్యత లభించగా ఒంగోలు లోక్‌సభ లాంటి స్థానంలో 25 ఏళ్ల అనంతరం ఆ పార్టీ జెండా ఎగరటం విశేషం. అదేసమయంలో అనూహ్య పరాజయాలతో వైసీపీ పునాదులు కూడా కదిలిపోయాయి. 1983-85, 94నాటి విజయాల కన్నా ఈ ఏడాదిలో ఉమ్మడి జిల్లాలో టీడీపీకి లభించిన విజయం ఘనమైనదంటే అతిశయోక్తి కాదు. అలాగే పులివెందుల తరహా పటిష్ట స్థానంగా భావించిన ఒంగోలు లోక్‌సభ స్థానంలో, గత ఎన్నికల్లో 80వేలకు పైబడిన ఆధిక్యత సాధించిన గిద్దలూరు అసెంబ్లీలో వైసీపీ కలలో కూడా ఊహించని చేదు అనుభవాలను ఎదుర్కొంది. నాయకులుగా చాలామందికి ఈ ఏడాది కనిసి రాగా కరణం బలరాం, బాలినేనిలాంటి కీలక నేతలు పరాజయం పాలయ్యారు. జిల్లాతో విడదీయరాని అనుబంధం ఏర్పర్చుకున్న మాగుంట కుటుంబ వారసురాల్లో ఒకరైన మాజీ ఎంపీ పార్వతమ్మ కన్నుమూయటం విషాదం. అదే కుటుంబానికి చెందిన శ్రీనివాసుల రెడికి అదృష్టం కలిసొచ్చి మళ్లీ పార్లమెంట్‌కు వెళ్లగలిగారు. దామచర్ల సత్య, బాలాజీ, దినకర్, మర్రెడ్డి, విజయ్‌కుమార్‌లాంటి ఎందరో అధికార అందలం ఎక్కగలిగారు. గొట్టిపాటి రవి, స్వామిలు అమాత్యులుగా జిల్లాలో కీలక నాయకులుగా మారగా కొత్తగా శాసనసభలో అడుగుపెట్టాలని తహతహలాడిన ఒకరిద్దరిని అదృష్టం వరించగా ఒకరిద్దరిని దురదృష్టం వెంటాడింది

మారిన పరిస్థితులు

ఒంగోలు, మార్కాపురం, కనిగిరి డివిజన్ ప్రాంతాల్లో భూఆక్రమణలు వాటిపై సిట్ ఏర్పాటు, వేధింపులు, గ్రానైట్ రంగంలో కడప నుంచి జిల్లాకు దిగుమతి అయిన జగన్ గ్యాంగ్ ఆగడాలు, ప్రజాప్రతినిధుల హంగూ ఆర్భాటాలు ఈ ఏడాది ప్రారంభంలో కనిపించిన దృశ్యాలు. ఈ ఏడాది మే నెలలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మార్పుతో ఆ పరిస్థితులన్నీ తారుమారై అక్రమ కేసులు లేవు. హత్యలు లేవు. రాజకీయ వేధింపులు లేవు. భూఆక్రమణలు కనిపించటం లేదు. జూదాలు బదులు గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం, వెరసి రాజకీయ వేధింపుల విముక్తితో ప్రజలు, ఉద్యోగులకు ప్రశాంత జీవితం ప్రారంభమైంది.

రవికుమార్, స్వామిలకు అందలం

ఈ ఏడాది ప్రారంభంలో ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ ప్రభుత్వ వేధింపులతో ఇబ్బందుల్లో ఉన్న గొట్టిపాటి రవికుమార్, స్వాములు మళ్లీ గెలవటమే కాక ప్రాధాన్యత కలిగిన శాఖలకు మంత్రులయ్యారు. అంతేకాక ముఖ్యమంత్రికి నమ్మకస్తులైన మంత్రులుగా మనగలగటం విశేషం.

గెలిచినా కలిసిరాని కాలం

ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకించి టీడీపీలో గెలిచినా పర్చూరు, ఒంగోలు ఎమ్మెల్యేలకు కాలం కలిసిరాలేదు. ముఖ్యంగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయం సాధించటంతోపాటు గడిచిన ఐదేళ్లు బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా పార్టీ బండిని ముందుకు లాగారు. కానీ ఆయన ఎమ్మెల్యేగానే మిగిలారు. ఆ జిల్లా నుంచి ఇద్దరు మంత్రులయ్యారు. ప్రకాశం జిల్లాలో క్లిష్ట సమయంలో పార్టీ బాధ్యతలు మోసిన దామచర్ల జనార్దన్ ఒంగోలు ఎమ్మెల్యేగా మంచి విజయం సాధించినా అదనపు పదవులు దక్కలేదు.

ఉగ్ర, అశోక్‌లకు గుర్తింపు

తెలుగుదేశం పక్షాన గెలుపొందిన వారిలో కనిగిరి, గిద్దలూరు ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డిల గెలుపులకు మంచి గుర్తింపు లభించింది. నిజానికి ఆ ఇద్దరు పోటీ చేసిన స్థానాలు వైసీపీకి బలమైన వైనప్పటికీ టీడీపీ గెలుపులో కూటమి పార్టీల అనుకూల వాతావరణంతో పాటు ఆ ఇద్దరు నాయకుల వ్యక్తిగత కృషి దాగుందనే విషయాన్ని అధిష్టానం గుర్తించి ప్రోత్సహించటం విశేషం.

మాగుంటను వరించిన అదృష్టం

అప్పట్లో కాంగ్రెస్‌కు ప్రస్తుతం వైసీపీకి పులివెందుల తర్వాత ఆ స్థాయిలో ఒంగోలు లోక్‌సభ స్థానం బలమైందిగా పేరుంది. అందునా మాగుంట కుటుంబం నుంచి శ్రీనివాసులరెడ్డి ఎంపీగా ఉండటం కూడా కలిసొచ్చింది. కానీ జగన్ చేసిన పొరపాటో, మాగుంట అదృష్టమో గాని వైసీపీ టిక్కెట్ నిరాకరణతో టీడీపీలో చేరారు. కూటమి పార్టీల వేవ్‌లో రెండున్నర దశాబ్దాల అనంతరం టీడీపీ తరపున ఆయన గెలవటం విశేషం.

పదవుల ప్రాధాన్యత

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పాలక పదవులు ఉమ్మడి జిల్లాకు అధికంగా దక్కాయి. ఉమ్మడి జిల్లాలో ఇద్దరికీ అందునా కీలకమైన టీడీపీ నుంచే మంత్రి పదవులు దక్కటమే విశేషంగా భావించారు. ఆ తర్వాత నామినేటెడ్ పదవుల భర్తీలో తొలి జాబితాలోనే నాలుగు కీలకమైన కార్పొరేషన్లు దక్కాయి. దామచర్ల సత్యా, లంకా దినకర్ లాంటి వారు తొలిసారిగా ప్రభుత్వ పదవులను అలంకరించగలిగారు.

అస్తమించిన పార్వతమ్మ

జిల్లాలో ప్రత్యేకించి ఒంగోలు లోక్‌సభలో తమదైన ముద్ర వేసుకున్న మాగుంట కుటుంబ తొలి వారసురాలు దివంగత ఎంపీ సుబ్బరామరెడ్డి సతీమణి పార్వతమ్మ ఈఏడాదిలోనే అస్తమించారు.

బాలినేని, కరణం, ఆదిమూలంకు కలిసిరాలేదు

బాలినేని, కరణం, ఆదిమూలంకు కలిసిరాని కాలంగా చెప్పవచ్చు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల మంత్రిగా పనిచేసిన ఆదిమూలపు సురేష్‌కు శాసనసభకు ఎన్నికయ్యే అవకాశం కూడా దక్కలేదు. వివిధ రకాలుగా అయా సందర్భాల్లో జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన మాజీ మంత్రి బాలినేని ఈ ఏడాది ఆరంభానికి ఎమ్మెల్యేలుగా ఉన్న కరణం బలరాంలు మాజీలయ్యారు. మాజీ మంత్రి మహిదర్‌రెడ్డికి తాను అంటిపెట్టుకున్న వైసీపీలో పోటీచేసే అవకాశమే దక్కలేదు. గతంలో రాష్ట్రంలో రెండవ ఘనవిజయం సాధించిన అన్నా రాంబాబుకు చేదు అనుభవం ఎదురైంది. ఎక్కడ నుంచో వచ్చి ఒంగోలు లోక్‌సభకు పోటీచేసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. అనుహ్యంగా టిక్కెట్ దక్కించుకున్న చంద్రశేఖర్‌కు ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేగా గెలుపొందటం అదృష్టమే. గతంలో పలు చేదు అనుభవాలను ఎదుర్కొన్న ఎంఎం కొండయ్య యాదవ్ చీరాల ఎమ్మెల్యే కాగా చివర్లో టిక్కెట్ దక్కించుకున్న ఇంటూరు నాగేశ్వరరావు కందుకూరు ఎమ్మెల్యే కాగలిగారు. క్లిష్టమైన నియోజకవర్గంలో అదృష్టాన్ని పరిక్షించుకున్న యువనాయకులు ఎరిక్షన్‌బాబు, కుటుంబ నేపథ్యంతో రంగంలోకి వచ్చిన గొట్టిపాటి లక్ష్మీలకు అదృష్టం కలిసికాక ఓటమిపాలయ్యారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

అద్దంకి, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మణికేశ్వరంలో కృష్ణ మిల్క్ యూనియన్, విజయ డెయిరీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బోనస్ పంపిణీ చేశారు. ఆగస్టు నుంచి నవంబరు వరకు 7 శాతం చొప్పున బోనస్ పంపిణీ చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోఒక కోటి యాభై మూడు లక్షల రూపాయలు పాడి రైతులకు బోనస్ కింద పంపిణీ చేశామని జిల్లా మేనేజర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ తరుణ్, గాలిబ్‌బాషా పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఫసల్ బీమా గడువు

పీసీపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా నమోదు గడువు మంగళవారంతో ముగుస్తుందని మండల వ్యవసాయ అధికారి కె.ప్రకాశరావు తెలిపారు. రబీ సీజన్‌లో వరి, శనగ, మొక్కజొన్న, మిర్చి పంటలను సాగుచేసిన రైతుల్లో ఇప్పటివరకు బీమా చేయించుకోనివారు ఈనెల 31వతేదీ సాయంత్రంలోగా బీమా చేయించుకోవాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు బీమా వర్తించాలంటే ఈపంట నమోదుతో పాటు ప్రతిరైతు తప్పనిసరిగా ఫసల్ బీమా నమోదు చేయించుకోవాలన్నారు.

26 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు



పట్టుబడిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

చీరాలటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం పాలసీను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం దాడులు నిర్వహించి అక్రమ మద్యం రవాణాకు పాల్పడుతున్న వారిలో ఒకరిని చీరాల గడియార స్థంభం కూడలిలో, మరొకరిని పాతచీరాల రైలు గేటు సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. అలాగే ఇరువురి వద్ద 26 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సై శ్రీహరి పాల్గొన్నారు.

డ్రోన్‌తో పంటలపై పురుగుమందుల పిచికారీ

సాంకేతిక పరిజ్ఞానం వైపు అన్నదాతల అడుగులు

కూలీల కొరతను అధిగమించే విధంగా చర్యలు

పర్చూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) కూలీల కొరతను అధిగమించే విధంగా అన్నదాతలు సాంకేతిక పరిజ్ఞానం వైపు అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా డ్రోన్ల సహాయంతో క్రిమి సంహారక మందులు పిచికారీ చేయించే విధంగా చర్యలు చేపడుతున్నారు. దీంతో సమయంతోపాటు, కూలీల కొరతను అధిగమించవచ్చని అన్నదాతలు చెబుతున్నారు. ఏదిఏమైనా వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం రైతులకు మరింత ఊరట లభిస్తుంది అనటంలో ఎలాంటి సందేహం లేదు.



పర్చూరులో శనగ పైరులో క్రిమిసంహారక మందును పిచికారీ చేస్తున్న డ్రోన్



అంజన్నకు కదళీఫలార్చన సేవ

అద్దంకి, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా సోమవారం దశ సహస్ర కదళీఫలార్చన పూజ నిర్వహించారు. సోమవారం ఉదయం సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం పూజలు చేశారు. అనంతరం వేద పండితులు, అర్చకులు 11 ఆ వృత్తాలుగా 10 వేల అరటిపండ్లతో పూజ చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజలలో పాల్గొన్నారు.

అవీఇవీ

భర్త మృతికి కారకులైన వారిని శిక్షించాలంటూ ఎస్పీకి ఫిర్యాదు


బాపట్లరూరల్,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తన భర్త మృతికి కారకులైన వారిని ఇంత వరకు శిక్షించలేదంటూ వారికి శిక్షపడేలా చూడాలంటూ సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో బల్లికురవ మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన చింతల బాలకోటమ్మ అర్జీని ఎస్పీకి అందజేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయం ఎదుట విలేకర్లతో మాట్లాడుతూ మన్నెపల్లి వెంకటేశ్వర్లు, మన్నెపల్లి మారుతీరావు, కనపర్తి అర్జున్,పరిమి సుబ్బారావు అనే నలుగురు తన భర్తను వేధింపులకు గురిచేయటంతో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంపై అద్దంకి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ నేరస్థులను అరెస్ట్ చేయలేదు. కావున నా భర్త మరణానికి కారణమైన వీరిని అరెస్ట్ చేయాలని ఎస్పీకి ఫిర్యాదు ఇవ్వటం జరిగిందని తెలిపారు.

నివాస స్థలంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బాపట్లరూరల్,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తన నివసిస్తున్న నివాస స్థలం కొంతమంది బెదిరించి ఆక్రమించాలని చూస్తున్నారంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఇంకొల్లు మండలం సూదివారిపాలెంకు చెందిన పి.నాగమల్లేశ్వరి అర్జీని కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో బాధితురాలు విలేకర్లతో మాట్లాడుతూ తమ గ్రామ ఎస్టీకాలనీలో గత 25 సంవత్సరాల క్రితం ప్రభుత్వం తనకు ఇంటి స్థలాన్ని మంజూరు చేశారు. ఆ స్థలంలో ఇల్లుకట్టుకొని ముగ్గురు ఆడపిల్లలతో నివాసం ఉంటున్నానని చెప్పారు. ఇప్పుడు దేవరకొండ ప్రశాంత్, యు.శ్రీను, యు.గోపి, యు.ఆదిశేషు, దేవరకొండ వేణులు వచ్చి నువ్వు నివసిస్తున్న స్థలాన్ని ఐదేళ్ల క్రితం మేము కొన్నాం.. ఖాళీ చేయండి అని బెదిరిస్తున్నారు. సంబంధిత అధికారులు తమ సమస్యకు పరిష్కారం చూపి వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చామని తెలిపారు.

సమస్యల పరిష్కారం కోరుతూ రోడ్డెక్కిన లాయర్లు

నేడు పెన్‌డౌన్...



నిరసన చేస్తున్న న్యాయవాదులు

చీరాలటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సమస్యలకు పరిష్కారం కోరుతూ చీరాల న్యాయవాదులు రోడ్డెక్కారు. ఇటీవల కాలంలో అనంతపురం జిల్లాలో పోలీస్ స్టేషన్‌లో న్యాయవాది మృతి, మరో ఘటనలో న్యాయవాది కాలర్‌ను ఓ సీఐ పట్టుకుని లాగిన విషయాలను ఉదహరిస్తూ సోమవారం పట్టణంలో ఆందోళన బాటపట్టారు. బాధితుల పక్షాన నిలిచి న్యాయ పోరాటాలు చేస్తున్న న్యాయవాదులకు రక్షణ కరువైందన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం విధులను బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వేడుకలకు అనుమతులు తప్పనిసరి

చీరాలటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, రహదారుల్లో అనుమతులు లేకుండా లౌడ్ స్పీకర్లు, డీజేలు, మ్యూజిక్ సిస్టంలతో పాటు నిర్వహించే కార్యక్రమాలకు అనుమతులు ఉండాలన్నారు.

రాష్ట్ర స్థాయిలో కొప్పెరపాడు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థికి నగదు బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

బల్లికురవ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిలో కౌశల్ 2024 క్విజ్ పోటీలు సోమవారం విజయవాడలో జరిగాయి. ఈ పోటీల్లో అన్ని జిల్లాల నుంచి 52 టీంలు పాల్గొన్నాయి. వీరిలో బాపట్ల జిల్లా తరఫున క్విజ్ పోటీల్లో బల్లికురవ మండలం కొప్పెరపాడు ఉన్నత పాఠశాలకు చెందిన బత్తుల అభిరామ్ ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి కౌశల్ తరఫున నిర్వాహకులు రూ.15 వేల నగదుతోపాటు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అభిరామ్‌ను ఎంఈవో వస్త్రంనాయక్, హెచ్ఎం శ్రీనివాసరావు అభినందించారు.

విద్యార్థులు మానసికంగా బలంగా ఉండాలి

మార్టూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే కోరుకున్న స్థాయికి చేరగలరని వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టరు రాజఅనిరుద్ చెప్పారు. మండలంలోని ద్రోణాదుల జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజఅనిరుద్ పలు అంశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పోతురాజు, నిర్వాహకులు రామాంజనేయులు, పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

యద్దనపూడి/మార్టూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలను నిరోధించడంతోపాటు వాటిని ఎవరూ ప్రోత్సహించవద్దని పర్చూరు ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర చెప్పారు. యద్దనపూడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కిషోర్ వికాసం కార్యక్రమానికి ఈవోఆర్‌డీ కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్ విజయలక్ష్మి, వెలుగు ఏపీవో వెంకటరావు, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి శ్రీహర్ష పాల్గొన్నారు.

15వ తేదీలోపు రేషన్ డీడీలు చెల్లించాలి

పంగులూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా 15వ తేదీలోపు డీడీలు చెల్లించాలని తహసీల్దారు పోపూరి సింగారావు చెప్పారు. సోమవారం మండల తహసీల్దారు కార్యాలయంలో జరిగిన ఎండీయూ ఆపరేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు ముందస్తు అనుమతి తప్పనిసరి


చినగంజాం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలకు నిర్వాహకులు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్.ఐ శీలం రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లౌడ్ స్పీకర్లు, మ్యూజిక్‌లు ఉపయోగించేందుకు తప్పనిసరిగా పోలీసు అధికారి నుంచి అనుమతి పొందాలని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం, పేకాట ఆడవద్దని తెలిపారు. వాహనాల సైలెన్సర్‌లు తీసి వేగంగా నడపడం, హారన్ అదేపనిగా మోగించడం, ర్యాంగ్ రూట్లలో డ్రైవ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక అక్రమ రవాణాపై పోలీసు యంత్రాంగం అప్రమత్తం


తనిఖీ చేస్తున్న ఎస్సై

ఈపూరుపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో ఇసుక అక్రమ రవాణా సంఘటనలకు సంబంధించి చీరాల మండలం బోయినవారి పాలెంలో వివాదం తలెత్తింది. ఈనేపథ్యంలో విచారణ జరిపిన జిల్లా కలెక్టర్ వెంకట మురళీ ముగ్గురు అధికారులను సోమవారం సస్పెండ్ చేశారు. ఇదిలా ఉంటే ఉన్నతాధికారుల నుండి అందిన కచ్చితమైన ఆదేశాలతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఈనేపథ్యంలో బోయినవారి పాలెంలో ఇసుక క్వారీల సమీపంలో ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఇసుక రవాణాకు పాల్పడితే కఠినమైన చర్యలు ఉంటాయని ఈసందర్భంగా అధికారులు చెబుతున్నారు.

మోక్షం లభించేనా?





● కొప్పెరపాడు-వెలమవారిపాలెం రోడ్డు పూర్తి అధ్వానస్థితికి చేరింది. ఇటీవల వర్షాలకు మరింత దెబ్బతింది. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్డు మరమ్మతులకు మోక్షం లభించేనా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రోడ్డు మరమ్మతులకు ఒక తట్ట మట్టి కూడా పోయలేదు. అద్దంకి-నార్కెట్‌పల్లి రోడ్డు కొప్పెరపాడు గ్రామకూడలి నుంచి కొత్తూరు, వెలమవారిపాలెంతోపాటు వెంపరాల వరకు ఉన్న తారురోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అడుగడుగునా మోకాటి లోతు గోతులు ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే ఈ రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - బల్లికురవ

అద్దంకిలో మూడు గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం

రాజీవ్‌కాలనీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా జరిగే విద్యుత్ లైన్ మరమ్మతులతో నిలిచిన సరఫరా


అద్దంకిలో చీకట్లో నిర్వహిస్తున్న టీ దుకాణాలు

అద్దంకి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో సుమారు 3 గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శింగరకొండ రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద నుంచి రాజీవ్ కాలనీ సబ్‌స్టేషన్ వద్దకు ఉన్న విద్యుత్ లైన్ సోమవారం వేకువజామున 3 గంటల సమయంలో మరమ్మతులకు గురైంది. రాత్రి సమయం కావటంతో మరమ్మతులకు గురైన ప్రాంతం గుర్తించేసరికి తెల్లవారుజామున 5-45 గంటల సమయమైంది. దీంతో సుమారు 3 గంటల పాటు పట్టణంలోని సగభాగం


విద్యుత్ లేకపోవటంతో నామ్ రోడ్డు లో చీకటి

విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అకస్మాత్తుగా 3 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో వినియోగదారులు విద్యుత్‌శాఖ అధికారులకు, విద్యుత్ కార్యాలయానికి ఫోన్లు చేసి కనుక్కున్నారు.

భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి

బల్లికురవ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలు లేకుండా ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేకు రైతులు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ కోరారు. సోమవారం మండలంలోని గుంటుపల్లిలో చేపట్టనున్న రీసర్వేపై రైతులతో గ్రామసభ జరిగింది. ఈసందర్భంగా డీటీ మాట్లాడుతూ రైతులు సర్వే చేసే భూముల వద్దకు తమ వద్దఉన్న హక్కు పత్రాలను తీసుకురావాలన్నారు. అన్ని సర్వే నెంబర్లను వరుస క్రమంలో కొలతలు వేస్తామని చెప్పారు. సభలో సర్వే డీటీ ప్రహర్ష, వీఆర్వో రామకృష్ణ పాల్గొన్నారు.

పర్చూరులో...

పర్చూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణాయపాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఎంఎస్ బాలాంజనేయులు, ఆర్ఐ బి.ప్రేమ్‌కుమార్, వీఆర్వో అనూష, వియ్ ఎ.నాయక్, పాల్గొన్నారు.

భూముల రీ సర్వే కోసం దరఖాస్తుచేసుకోండి

మార్టూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు రవికుమార్ చెప్పారు. యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ విష్ణు, మండల సర్వేయరు సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజు, వీఆర్‌వో వసంతరావు పాల్గొన్నారు. మార్టూరు మండలంలోని జొన్నతాళి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 5 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు ప్రశాంతి చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీ నాగలక్ష్మి, మండల సర్వేయరు ఏడుకొండలు పాల్గొన్నారు.


రమణాయపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

అమృత్ సరోవర్ నీటి కుంట పనులు ప్రారంభం


ముక్తేశ్వరంలో నీటి కుంట పనులు చేస్తున్న కూలీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ. డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో గతంలో ఉపాధి హామీ పథకంలో మంజూరైన నిధులతో నీటి కుంట పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం అజాదీకా అమృత్ సరోవర్ ద్వారా ప్రజల అవసరార్థం గ్రామాలలో నీటి కుంటల ఏర్పాటుకు నిధులను మంజురు చేసింది. ఉపాధి హామీ పథకంలో ముక్తేశ్వరానికి రూ.25 లక్షల నిధులు మంజురయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో పనులు మెదలు పెట్టి నిలిపివేశారు. రెండు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో నీటి కుంట జాడేదీ అనే కథనం ప్రచురితం కావటంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పనులు చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉపాధి కూలీలచేత పనులు మొదలుపెట్టారు. ఈ కుంట పనులు పూర్తి అయితే పొలాలకు వెళ్లిన పశువులకు నీటి అవసరాలు తీరుతాయని రైతులు అంటున్నారు.

అవీఇవీ

మేళాను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ కె.వీరయ్య

అద్దంకిటౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలను నిరుద్యోగ, యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె. వీరయ్య చెప్పారు. సోమవారం శింగరకొండరోడ్డులోని సాయిబాబా ఐటీఐ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలకు వివిధ కంపెనీలు రాగా 35 నిరుద్యోగులు హాజరయ్యారు. వీరిలో 17 మంది ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి. ప్రణయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి. శ్రీనివాస్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ గోపినాథ్, ఈఎస్‌సీ కోఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు మోడల్ పేపర్స్, బుక్స్ అందజేత


మోడల్ పేపర్స్ బుక్స్ అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మండలంలోని మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్స్ బుక్స్‌ను అందజేశారు. దాత మలాది శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో విద్యార్థులకు మోడల్ పేపర్స్‌ను అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగేశ్వరరావు, రోటరీ కార్యదర్శి మురళి సుధాకరరావు, శేషారెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ భీమని కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పర్చూరులో...

పర్చూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని ఆమంచి నరసింహం, వెంకట సుబ్బమ్మ బాలికల పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినులకు సోమవారం ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను రొటేరియన్ కోటా శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం అవని, పాఠశాల కరస్పాండెంట్ క్రిష్ణంశెట్టి రమేష్ బాబు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి రూ.లక్ష విరాళం


నగదును అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) దాతల సహకారంతో రూపు దిద్దుకుంటున్న పర్చూరు హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి పర్చూరు రోటరీ క్లబ్ రూ.లక్ష విరాళం అందజేసింది. ఈసందర్భంగా స్థానిక రోటరీ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో క్లబ్ ప్రతినిధులు లక్ష రూపాయలను నగదును శ్మశానవాటిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కఠారి సురేంద్రబాబు, ఒగ్గిశెట్టి గోవిందరాజులకు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ మంగళగిరి కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో రోటరీ క్లబ్ చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు కొల్లా నరేంద్రకుమార్, నాగబైరు శ్రీనివాసరావు, కోటా హరిప్రసాద్, తేళ్ల రమేష్‌చంద్ర, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రం, పంబి సదానందరెడ్డి, మహాప్రస్థానం ప్రతినిధులు ఒగ్గిశెట్టి నరసింహారావు, కృష్ణంశెట్టి శ్రీనివాసరావు, తులసి శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన సభ్యులకు యూటీఎఫ్ అండ

పంగులూరు, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో మృతిచెందిన యూటీఎఫ్ సభ్యులైన ఉపాధ్యాయ కుటుంబాలకు యూటీఎఫ్ అండగా ఉంటోందని ఆ సంఘ రాష్ట్రగౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు చెప్పారు. ఇటీవల మండల శాఖ అధ్యక్షుడు, టీటర్ తోట నరసింహారావు ఆకస్మికంగా మృతిచెందడంతో సోమవారం మండలంలోని రేణంగివరంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సంతాపసభ నిర్వహించారు. సభకు ప్రధానోపాధ్యాయులు సందిరెడ్డి శ్రీహరి అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ నరసింహారావు కుటుంబానికి యూటీఎఫ్ సంక్షేమనిధి నుంచి రూ.1.50 లక్షల చెక్కును అందచేశామన్నారు. కార్యక్రమంలో పూనాటి హరిబాబు, యు చెంచయ్య, ఎస్ ప్రసాద్, వైద్యులు హనుమంతరావు, తలపనేని రామారావు, జి మల్లారెడ్డి, బి రవిచంద్ర, రంగా శ్రీనివాసరావు, టి వెంకట్రావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి


తీవ్రంగా గాయపడ్డ తిరుపతి నాగరాజు

అద్దంకి,డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు మండలంలోని చక్రాయపాలెంకు చెందిన తిరుపతి నాగరాజు(26) మోటార్‌సైకిల్‌పై సోమవారం రాత్రి శింగరకొండ వైపు నుండి చక్రాయపాలెం వెళ్తుండగా భవనాసి చెరువు కట్ట వద్ద నామ్ రోడ్డులోకి వెళ్లే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పోలీస్‌లు పరిశీలించారు. నాగరాజు చేపలవేట, కూలి పనులకు వెళ్ళి జీవనం సాగిస్తుంటాడు. ఇంకా వివాహం కాలేదు. కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

మేదరమెట్ల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డువానిపాలెం వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బొడ్డువానిపాలెంలో సోమవారం గ్రామానికి చెందిన దుడ్డు గౌతమ్(4) అనే బాలుడు తాత నాగయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై బొడ్డురాయి దగ్గరకు వచ్చారు. అదే దారిలో వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో బైక్‌పై ఉన్న తాత మనుమడును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గౌతం తలకు తీవ్ర గాయాలు కావడంతో ఒంగోలు హాస్పిటల్‌కు తరలించారు. బాలుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. తాతనాగయ్య ఫిర్యాదు మేరకు కొరిశపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.